
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 26 ఆగస్టు 2024



జిల్లాలో ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో తికమక నెలకొంది. ఈ నెలాఖరుకు, సెప్టెంబరు నెలలో ఇద్దరు తహసీల్దార్లు పదవీ విరమణ ఉండటంతో గుడ్లవల్లేరు, మచిలీపట్నం నార్త్ మండలాల తహసీల్దార్ల పోస్టులు ఖాళీ కానున్నాయి. దీంతో మళ్లీ ఈ పోస్టుల్లో ఎవరిని నియమిస్తారనే అంశంపై రెవెన్యూ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇద్దరు తహసీల్దార్ల పదవీ విరమణలు, ఇద్దరు తహసీల్దార్లను సీఆర్‌డీఏకు పంపేందుకు రంగం సిద్ధం కావడంతో మచిలీపట్నం, పెడన, గుడివాడ నియోజకవర్గాల్లోని మండలాల్లో మళ్లీ నూతనంగా తహసీల్దార్లను నియమించాల్సిన స్థితి నెలకొంది.



దేవదాయ శాఖలో బదిలీల వేడి రాజుకుంటోంది. ఉమ్మడి కృష్ణాజిల్లాతోపాటు ఉభయగోదావరి జిల్లాలకు ప్రాతినిధ్యం వహించే కాకినాడ డిప్యూటీ కమిషనర్ (డీసీ) పోస్టుకు భారీగా డిమాండ్ పెరుగుతోంది. అదే సమయంలో జిల్లా దేవదాయశాఖ అధికారి పోస్టుల కోసమూ పైరవీలు మొదలయ్యాయి. ఐదేళ్లలో వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన వారే నేడు టీడీపీ నాయకుల పంచన చేరి సిఫార్సు లేఖలు తీసుకుంటున్నారు. గతంలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాలకు దేవదాయ శాఖ అధికారిగా పనిచేసిన శాంతిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తడంతో ఆమెపై అధికారులు సస్పెన్షన్ వేటు వేసిన విషయం విదితమే. అప్పటి నుంచి ఎన్టీఆర్ జిల్లా దేవదాయ శాఖ అధికారిణిగా సుబద్రాదేవి, కృష్ణాజిల్లా దేవదాయ శాఖ అధికారిణిగా సంధ్య అదనపు బాధ్యతలపై కొనసాగుతున్నారు. ప్రస్తుతం డీసీతోపాటు రెండు జిల్లాలకు దేవదాయ శాఖ అధికారులను కూడా నియమించాల్సి ఉంది.

బదిలీల వేడి

దేవదాయశాఖలో జోన్-2 డీసీ పోస్టుకు భారీ డిమాండ్

- అర కోటి ఖర్చు పెట్టడానికి సై
- రేసులో నాడు వైసీపీతో అంటకాగిన అధికారులు
- ఉదారంగా సిఫారసు లేఖలు ఇస్తున్న టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు
- జిల్లా దేవదాయశాఖ అధికారుల పోస్టులకూ జోరుగా పైరవీలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం కాకినాడ డీసీగా ఉన్న ఎం.విజయరాజు గత ఐదేళ్లలో వైసీపీ నేతలతో అంటకాగారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆయనపై అవినీతి ఆరోపణలు.. ఏసీబీ కేసు ఉండటంతో ఆయన్ను ఆ స్థానం నుంచి కదిలించడం ఖాయమని దేవదాయశాఖ వర్గాలు చెబుతున్నా అదే స్థానంలో కొనసాగేందుకు ఆయన శాయశక్తులా ప్రయత్నాలు చేసుకుంటున్నారు.

కాకినాడ డీసీ కోసం డీఎల్‌వీ రమేశ్ బాబు విశ్వప్రయత్నం

- కాకినాడ డీసీ పోస్టును చేజిక్కించుకునేందుకు డీఎల్‌వీ రమేశ్ బాబు కూడా తీవ్రంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈయన ప్రస్తుతం అన్నవరం దేవస్థానం డిప్యూటీ కమిషనర్‌గా ఉన్నారు.

- వైసీపీ హయాంలో మంత్రిగా చేసిన దాడిశెట్టి రాజాకు అత్యంత సన్నిహితుడిగా రమేశ్ బాబుకు పేరుంది. వైసీపీ నాయకులు ఏ పని చెప్పినా ఆగమేఘాలపై చేస్తారని పేరుపొందారు. ఈ కారణంగానే ఆయన్ను ఏళ్ల తరబడి అన్నవరం దేవస్థానం నుంచి కదపకుండా కొనసాగిస్తున్నారన్న పేరుంది. కాకినాడ డీసీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా చేసే సమయంలో ఈయనపై మహిళా ఉద్యోగులను లైంగికంగా వేధించారన్న ఆరోపణలూ ఉన్నాయి. ప్రస్తుతం రమేశ్‌బాబును డీసీ పోస్టుకు సిఫార్సు చేస్తూ పలువురు టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు లేఖలు ఇచ్చినట్టు సమాచారం.

మాన్సాస్ ట్రస్టు ఈవో కూడా గట్టి ప్రయత్నం

- ప్రస్తుతం మాన్సాస్ ట్రస్టు ఈవోగా ఉన్న కేఎస్‌వీడీ ప్రసాద్ కూడా కాకినాడ డీసీగా వచ్చేందుకు తన వంతు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. అయితే ద్రాక్షరామం ఈవోగా పనిచేసే సమయంలో అప్పటి మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణతో ప్రసాద్ సన్నిహితంగా ఉండేవారన్న ఆరోపణలు ఉన్నాయి. డీసీ పోస్టుకు ప్రయత్నాలు చేసుకుంటున్న రమేశ్‌బాబు, ప్రసాద్.. కూటమి ఎమ్మెల్యేల వద్దకు వెళ్లి వైసీపీ హయాంలో ఉన్న ఒత్తిళ్ల కారణంగా తాము అప్పటి ప్రజాప్రతినిధులు చెప్పినట్టు చేయాల్సి వచ్చిందని, అంతే కానీ తాము వైసీపీకి అనుకూలం కాదని, టీడీపీ, జనసేనకు విధేయులుగా ఉంటామని చెప్పుకొంటూ సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నట్టు సమాచారం. అదే సమయంలో భారీగా ఖర్చు పెట్టుకునేందుకూ వీరు సిద్ధమవుతున్నారు. కాకినాడ డీసీ పోస్టు కోసం సుమారు రూ.50 లక్షల వరకు ఖర్చు చేసుకునేందుకు వీరు సిద్ధమవుతుండటం గమనార్హం. డీసీ పోస్టు దక్కించుకునేందుకు ఉవ్విళ్లూరుతున్నవారు అటు కమిషనర్ కార్యాలయంతోపాటు దేవదాయ శాఖ మంత్రి పేషీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

జిల్లా దేవదాయశాఖ అధికారి పోస్టులకూ గిరాకీ

ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల దేవదాయశాఖ అధికారి పోస్టులకూ భారీ డిమాండ్ నెలకొంది. ఈ పోస్టుల కోసం రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షలు ఖర్చు పెట్టుకునేందుకూ సిద్ధమవుతున్నారు. ఎన్టీఆర్ జిల్లా అధికారి పోస్టు సూపరింటెండెంట్ క్యాడర్ స్థాయిది. కృష్ణాజిల్లా అధికారి పోస్టు ఏసీ క్యాడర్ స్థాయిది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ జిల్లా అధికారి పోస్టు కోసం గతంలో అవినీతి ఆరోపణలపై సస్పెండ్ అయిన ఓ గ్రేడ్-1 ఈవో తీవ్రంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను సదరు ఈవో సంపాదించినట్టు సమాచారం. ఆ అధికారితోపాటు మరో నలుగురు రేసులో ఉన్నారు. కృష్ణాజిల్లా అధికారి పోస్టుకు భారీగానే డిమాండ్ నెలకొంది. ఐదుగురు ఈ పోస్టు కోసం ఎవరి స్థాయిలో వారు పైరవీలు చేసుకుంటున్నట్టు సమాచారం.

బదిలీల్లో తికమక



డిప్యుటేషన్‌పై మచిలీపట్నం నార్త్ తహసీల్దార్

- మచిలీపట్నం సౌత్ తహసీల్దార్‌ను సీఆర్‌డీఏకు పంపుతారని ప్రచారం
- పెడన, గన్నవరం తహసీల్దార్‌లు కూడా సీఆర్‌డీఏకు బదిలీ?
- గుడ్లవల్లేరు తహసీల్దార్ మరో రెండు రోజుల్లో పదవీ విరమణ

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మండలాన్ని గత ఏడాది ఫిబ్రవరి నెలలో సౌత్, నార్త్ మండలాలుగా విభజించారు. ఎన్నికల ముందు ఇద్దరు తహసీల్దార్లను ఎన్నికలసంఘం నిబంధనల మేరకు ఇతర జిల్లాల నుంచి నియమించారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక సౌత్ మండలం తహసీల్దార్‌గా పి.మధుసూదనరావును నియమించారు. ఆయన వచ్చి ఇరవై రోజులైనా కాకముందే ఆయన్ను సీఆర్‌డీఏకు పంపుతారనే ప్రచారం జరుగుతోంది. నార్త్ మండల తహసీల్దార్‌గా రెగ్యులర్ బదిలీల్లో ఎవ్వరినీ నియమించకుండా ఆ పోస్టును ఖాళీగా ఉంచారు. ఏలూరు జిల్లా ముదినేపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు కలెక్టరేట్‌లో ల్యాండ్ రీఫార్మ్స్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఆయన్ను మచిలీపట్నం నార్త్ మండల తహసీల్దార్‌గా గుట్టుచప్పుడు కాకుండా డిప్యుటేషన్‌పై నియమించారు. ఈ ఉత్తర్వులను ఎవ్వరికీ తెలియకుండా గోప్యంగా ఉంచారు. వచ్చే నెల సెప్టెంబర్ నెలాఖరు నాటికి ఆయన పదవీ విరమణ చేయనున్నారు. దీంతో మరో నెల రోజుల్లో నార్త్ మండల తహసీల్దార్ పోస్టు ఖాళీ కానుంది. జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని రెండు మండలాలకు చెందిన తహసీల్దార్లలో ఒకరు మరో నెలరోజుల వ్యవధిలో పదవీ విరమణ చేయనుండగా, మరొకరిని సీఆర్‌డీఏకు పంపుతారనే ప్రచారం జరుగుతోంది. ఇద్దరు తహసీల్దార్లు వెళ్లిపోతే మళ్లీ ఎవరిని ఈ పోస్టుల్లో నియమిస్తారనే అంశంపై రెవెన్యూ వర్గాలలో చర్చ నడుస్తోంది.

గన్నవరం, పెడన తహసీల్దార్ పోస్టుల్లో మార్పులు

గన్నవరం తహసీల్దార్‌గా ఈ నెలలో జరిగిన బదిలీల్లో ఎస్.సీతాపవన్ కుమార్‌ను నియమించారు. ఇతర జిల్లా నుంచి వచ్చిన ఆయన ఎన్నికల సమయంలో గన్నవరంలో పనిచేశారు. ఈ నెలలో జరిగిన బదిలీల్లో ఆయనను సీఆర్‌డీఏకు పంపాల్సి ఉండగా ఆయననే తహసీల్దార్‌గా కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేయడం వివాదాస్పదమైంది. దీంతో కలెక్టర్ జోక్యం చేసుకుని సీఆర్‌డీఏ నుంచి అనుమతులు తెచ్చుకుంటేనే గన్నవరం తహసీల్దార్‌గా కొనసాగిస్తామని, లేకుంటే వెనక్కు పంపేస్తామని చెప్పారు. సీఆర్‌డీఏ నుంచి సీతాపవన్‌కుమార్ అనుమతులు తెచ్చుకోకపోవడంతో ఆయనను అక్కడి నుంచి పంపేశారు.

- ఆ తరువాత వెంకట శివయ్యను గన్నవరం తహసీల్దార్‌గా నియమించారు. ప్రస్తుతం ఆయనను సీఆర్‌డీఏకు పంపుతారనే ప్రచారం జరుగుతోంది.
- మచిలీపట్నం పక్కనే ఉన్న పెడన మండల తహసీల్దార్‌గా ప్రస్తుతం పనిచేస్తున్న అబ్దుల్ రెహమాన్ మస్తాన్‌ను కూడా సీఆర్‌డీఏకు పంపుతారనే ప్రచారం జరుగుతోంది.
- గుడివాడ నియోజకవర్గం పరిధిలోని గుడ్లవల్లేరు తహసీల్దార్ మరో రెండు రోజుల్లో పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఇక్కడ నెలరోజుల వ్యవధిలోనే మళ్లీ తహసీల్దార్‌ను నియమించాల్సి వస్తోంది.
- మరో నెలరోజుల వ్యవధిలో మచిలీపట్నం నార్త్ మండల తహసీల్దార్ పదవీ విరమణ చేయనుండటంతో ఈ పోస్టులో మరొకరిని నియమించాల్సిన స్థితి ఏర్పడుతోంది.
- మచిలీపట్నం సౌత్, పెడన, గన్నవరంలలో ఎన్నికల సమయంలో జిల్లాలో పనిచేస్తూ ఇతర జిల్లాలకు వెళ్లి, మళ్లీ జిల్లాకు వచ్చిన తహసీల్దార్లలో నలుగురిని పక్కనపెట్టారు. దీంతో నలుగురు తహసీల్దార్లు తమవంతుగా ప్రయత్నాలు చేసుకుని ఏలూరు జిల్లాకు వెళ్లిపోవడం గమనించదగ్గ అంశం.

జీజీహెచ్‌లో మంకీ వార్డు

ప్రత్యేక వార్డు ఏర్పాటు చేయాలని ఆదేశాలు

- ప్రస్తుతం ప్రబలుతున్న విషజ్వరాలు
- కొంతమందికి శరీరంపై దద్దుర్లు



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) ఒంటి నిండా జ్వరం. శరీరంపై దద్దుర్లు, తలనొప్పి, వాంతులు.. ప్రస్తుతం విషజ్వరాలతో బాధపడుతున్న వారిలో కనిపిస్తున్న లక్షణాలు ఇవి. దాదాపుగా ఆరేడు రకాల వైరస్‌ల కారణంగా ఈ జ్వరాలు వస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు. తాజాగా మంకీపాక్స్ కలకలం రేగింది. ఈ వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నట్టు సామాజిక మాధ్యమాల్లో వార్త వైరల్ అవుతోంది. దీన్ని ప్రభుత్వాసుపత్రి వైద్యులు కొట్టిపారేస్తున్నారు. ప్రస్తుతానికి ఎలాంటి కేసులు ఆసుపత్రికి రాకపోయినప్పటికీ ముందు పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని మంకీపాక్స్ రోగులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న వార్తపై వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ స్పందించారు. ఆయన ఆదివారం విజయవాడ ప్రభుత్వాసుపత్రి వైద్యాధికారులకు ఫోన్ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతానికి ఆసుపత్రిలో మంకీపాక్స్ రోగులు ఎవరూ లేరని అధికారులు వివరించారు. అయినప్పటికీ ముందస్తు జాగ్రత్తగా ప్రత్యేకంగా ఒక వార్డును ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

ఆరు పడకలతో ఐసీయూ

విజయవాడ కొత్త ప్రభుత్వాసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో ఆరు పడకలతో మంకీపాక్స్ వార్డును అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఆదివారం సాయంత్రం నుంచి ప్రత్యేక వార్డు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి ఇందులో ఆరు పడకలను ఏర్పాటు చేశారు. ఈ వార్డులోకి అవసరమైన మందులు, వైద్యులను సమకూర్చారు. 24/7 వైద్యులు అందుబాటులో ఉండేలా డ్యూటీలు వేస్తున్నారు. సోమవారం నాటికి వార్డు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని ఆసుపత్రి అధికారులు వెల్లడించారు. ఆఫ్రికాలోని కోతుల ద్వారా వచ్చిన వైరస్‌తో మంకీపాక్స్ ప్రబలింది. ఈ వైరస్ సోకిన వారికి జ్వరం అధికంగా ఉంటుంది. శరీరం నిండా పెద్దపెద్ద బొబ్బలు ఉంటాయి. జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం విషజ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. వాటితోనే ఎక్కువమంది చిన్నారులు ఆసుపత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. ఒక కుటుంబంలో ఒకరికి జ్వరం వస్తే రెండు, మూడు రోజుల వ్యవధిలో మిగిలిన వారికి జ్వరాలు వస్తున్నాయి. ఆరు నుంచి 12 గంటల వ్యవధిలో వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపించడంతో ఈ జ్వరాలు పెరుగుతున్నాయని వైద్యులు నిర్ధారించారు. ఆఫ్రికా దేశాల నుంచి వచ్చే వారికి మంకీపాక్స్ పాజిటివ్ వస్తే అది మిగిలిన వారికి వ్యాపించే అవకాశాలు ఉన్నాయని వైద్యులు భావిస్తున్నారు. ఉన్నత విద్యాభ్యాసానికి సంబంధించి ఆఫ్రికా దేశాల నుంచి యువతీ యువకులు విజయవాడకు వస్తుంటారు. విజయవాడకు సమీపంలో కేఎల్ వర్సిటీ, ఆచార్య నాగార్జున వర్సిటీ ఉన్నాయి. ఈ రెండింటిలోనూ ప్రొఫెషనల్ కోర్సులు చేయడానికి ఆఫ్రికా దేశాలకు చెందిన విద్యార్థులు వస్తుంటారు. వారిలో ఎవరికైనా మంకీపాక్స్ పాజిటివ్ వస్తే అది ప్రబలే అవకాశాలు ఉన్నాయని ముందుస్తుగా గుర్తించిన అధికారులు ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రభుత్వాసుపత్రిలో ఏర్పాటు చేసే ప్రత్యేక వార్డు ఒక నోడల్ అధికారిని నియమించాలని అధికారులు నిర్ణయించారు.

మంచం పట్టిన పల్లెలు

విజృంభిస్తున్న విష జ్వరాలు

- కిటకిటలాడుతున్న ప్రైవేట్ ఆసుపత్రులు
- దోమల నివారణ, పారిశుధ్యంపై శ్రద్ధ చూపకపోవటమే నేటి పరిస్థితికి కారణమంటున్న ప్రజలు

అవనిగడ్డ నియోజకవర్గంలో గడిచిన 15 రోజులుగా జ్వరాల తీవ్రతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ ఆసుపత్రిలో చూసినా పదుల సంఖ్యలో జ్వర పీడితులు ఉంటున్నారు. కొన్ని ప్రాణాంతక జ్వరాలు ప్రజలను పీల్చిపిప్పి చేస్తున్నాయి. పారిశుధ్యం, దోమల నివారణపై శ్రద్ధ చూపని కారణంగానే జ్వర పీడితుల సంఖ్య పెరుగుతోంది. ప్రభుత్వ ఆసుపత్రులు, పీహెచ్‌సీలు, ప్రైవేట్ ఆసుపత్రులు చివరకు ఆర్ఎంపీల వద్ద రోగులు కిటకిటలాడుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.



అవనిగడ్డలో బల్లలు, మంచాలపై సెలైన్ పెట్టించుకుంటున్న జ్వర పీడితులు

అవనిగడ్డ : అవనిగడ్డ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో జ్వరాల తీవ్రత అత్యధికంగా కనిపిస్తోంది. అవనిగడ్డ ఏరియా ఆసుపత్రిలో వారం రోజులుగా నిత్యం 100 మందికి తగ్గకుండా జ్వరపీడితులు చికిత్స పొందేందుకు వస్తుండగా, ప్రైవేట్ ఆసుపత్రులు, ఆర్ఎంపీల వద్ద అయితే జ్వర పీడితులు బారులు తీరుతున్నారు. వేకనూరు పీహెచ్‌సీ పరిధిలోనూ, నాగాయలంక పీహెచ్‌సీ పరిధిలోనూ డెంగ్యూ లక్షణాలతో పలువురు విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వేకనూరు పీహెచ్‌సీలో మూడు రోజుల క్రితం ర్యాపిడ్ కిట్లతో చేసిన పరీక్షల్లో పలువురికి డెంగ్యూ పాజిటివ్‌గా తేలటంతో వారిని ఎలిసా పరీక్షకు పంపేందుకు అధికారులు సన్నద్ధమైనట్లుగా సమాచారం. నియోజకవర్గంలోనే అతిపెద్ద కాలనీ అయిన చల్లపల్లి నారాయణరావు నగర్ కాలనీలో పదుల సంఖ్యలో జ్వరాలు నమోదవుతున్నాయి. ప్రతి రెండు ఇళ్లకు కనీసం ఒక్క జ్వరం కేసు అయినా కనిపిస్తుండటం నియోజకవర్గంలోని పరిస్థితికి అద్దం పడుతోంది.

ప్లేట్‌లెట్లు పడిపోవటంతో ఆందోళన చెందుతున్న రోగులు

నియోజకవర్గంలో ఇటీవల కనిపిస్తున్న జ్వరాల తీవ్రతతోపాటు జ్వర లక్షణాలు ఉన్నవారికి ప్లేట్‌లెట్ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో రోగులు, వారి బంధువులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. 1.50 లక్షల నుంచి 4 లక్షల మధ్య ఉండాల్సిన ప్లేట్ లెట్ల సంఖ్య 30 నుంచి 40 వేల స్థాయికి పడిపోయిన కేసులు పదుల సంఖ్యలో నమోదు కావటంతో ప్లేట్ లెట్లు తగ్గిన వారికి తగిన చికిత్స అందించే ఏర్పాట్లు లేవన్న అపోహతో బాధితులు ప్రభుత్వ ఆసుపత్రిని వదిలి, ప్రైవేట్ ఆసుపత్రి వైపు పరుగులు తీస్తున్నారు.

దోమల నివారణ, పారిశుధ్య నిర్వహణ లోపమే ఈ పరిస్థితికి కారణమా?

దోమల నివారణ, పారిశుధ్య నిర్వహణ విషయంలో అధికారుల అలసత్వమే నేటి ఈ జ్వరాల తీవ్రతకు కారణమని ప్రజలు వాపోతున్నారు. గతంలో పీహెచ్‌సీల పరిధిలోని పంచాయతీలకు పీహెచ్‌సీలే దోమల నివారణకు ఎబేట్ మందును సరఫరా చేస్తూండేవావి. అయితే గడిచిన ఐదేళ్లుగా పీహెచ్‌సీల నుంచి పంచాయతీలకు దోమల నివారణ మందు పూర్తిగా నిలిచిపోవటంతో కేవలం మేజర్ పంచాయతీలు మాత్రమే నామమాత్రంగా మందు పిచికారీ చేసి మమ అనిపిస్తున్నాయి. కనీసం బ్లీచింగ్ చల్లేందుకు కూడా పంచాయతీల్లో నిధులు లేక ప్రజల కళ్లనీళ్లు తుడిచేందుకు సున్నం చల్లి సరిపెడుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కొద్ది రోజుల క్రితం వరకు యాంటీ డయేరియా క్యాంపెయిన్ నిర్వహించిన సందర్భంగా అవనిగడ్డ, నాగాయలంక, చల్లపల్లి వంటి మేజర్ పంచాయతీల్లో బ్లీచింగ్ కంటే సున్నం ఎక్కువ చల్లి సరిపెట్టారు. దోమల నివారణపై శ్రద్ధ చూపకపోవటంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా దోమల ఉధృతి తీవ్రమై డెంగ్యూ వంటి ప్రాణాంతక జ్వరాలు ప్రబలుతున్నాయని, వెంటనే పంచాయతీలు దోమల నివారణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కిడ్నీ వ్యాధికి మరొకరు బలి



గొల్లమందల కృష్ణ (ఫైల్)

గంపలగూడెం, ఆగస్టు 25 : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆదివారం వృద్ధుడు మృతి చెందాడు. అనుముల్లంక గ్రామానికి చెందిన గొల్లమందల కృష్ణ (62) కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఇటీవల కిడ్నీ వ్యాధి తీవ్రమై హైదరాబాద్‌లో ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన భౌతికకాయాన్ని టీడీపీ నాయకులు అత్తనూరు రామిరెడ్డి, అంజిరెడ్డి, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కిడ్నీ వ్యాధితో ఈనెలలోనే ముగ్గురు మృతి చెందారు. మరో 50 మంది బాధితులు చికిత్స తీసుకుంటున్నారు. మూడు నెలల క్రితం కృష్ణ తమ్ముడు కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఇప్పుడు అన్న మృతి చెందాడు.

గంజాయి ముఠా అరెస్టు

- రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- ఎస్పీ గంగాధరరావు

6లో..

డ్వాక్రా మహిళల ఆర్థిక పురోభివృద్ధికి కృషి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

6లో..



భక్తిశ్రద్ధలతో..

భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిటలాడింది. అమ్మవారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. కృష్ణానదిలో పవిత్ర స్నానాలు ఆచరించారు.


అనధికారిక కట్టడాన్ని కూల్చివేసిన అధికారులు

నా ఇంటి స్థలం కబ్జా చేశారు!

- ఆక్రమిత స్థలంలో అనధికారిక నిర్మాణం
- బాధితుడి ఫిర్యాదుతో కూల్చివేసిన అధికారులు


బాధితుడు కోటయ్య

విద్యాధరపురం, ఆగస్టు 25 : భవానీపురం ప్రియదర్శిని కాలనీలో తాము కొనుగోలు చేసిన 63 గజాల ఇంటి స్థలాన్ని భోగ సముద్రం శ్రీనివాసరెడ్డి కుటుంబం దొంగ పత్రాలు సృష్టించి ఆక్ర మించుకుందని బాధితుడు పురుషోత్తపట్నం కోటయ్య (అలి యాస్ కోటేశ్వరరావు) ఆరోపించారు. భవానీపురం ఆర్ఎస్ నెం.45లో 63 చదరపు గజాల స్థలాన్ని 1993 డిసెంబరు 4వ తేదీన చింతలపూడి గురు మూర్తి వద్ద తాము కొనుగోలు చేసినట్టు కోటయ్య తెలిపారు. ఈ స్థలంపై భోగసముద్రం శ్రీనివాసరెడ్డి, అతడి భార్య సుబ్బులకు ఎలాంటి హక్కు లేదని, వారే కావాలని నకిలీ పత్రాలు సృష్టించి అన్యాయంగా తన స్థలాన్ని ఆక్రమించుకున్నారని బాధితుడు వాపో యారు. ఈ వ్యవహారంపై సంబంధిత అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు. అధికారులు విచారించి స్థలానికి హక్కుదారుడిగా తననే నిర్ధారించారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉందని, అయితే శ్రీనివాసరెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా స్థలంలో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టాడని తెలిపారు. దీనిపై కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేయగా శనివారం కూల్చివేశారని తెలిపారు.



ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దొరస్వామికి పాతూరి నాగభూషణం పురస్కారాన్ని అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణిస్తారు

- ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ దొరస్వామి

గవర్నర్‌పేట, ఆగస్టు 25 : కృషి, పట్టుదల ఉంటే యువత ఏ రంగంలోనైనా రాణించి ఉన్నత స్థితికి చేరవచ్చని, నిబద్ధత, సమయపాలన అలవర్చుకోవాలని ద్రవిడ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఎం.దొరస్వామి అన్నారు. విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఆదివారం పాతూరి ఫౌండేషన్ దొరస్వామికి పాతూరి నాగభూషణం పుర స్కారాన్ని అందజేసింది. శాలువా కప్పి, జ్ఞాపికను అందజేశారు. సభకు ఫౌండేషన్ అధ్య క్షుడు కేసీ కాల్కూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా దొరస్వామి మాట్లాడుతూ, గ్రంథ పాలకులు అన్ని అంశాల్లోనూ నిష్ణాతులుగా ఉంటారని, వారి సేవలను కళాశాలలు, విశ్వవిద్యాలయాలు ఉపయోగించుకోవాలని కోరారు. తనకు పురస్కారాన్ని అందించడం పట్ల సంస్థ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం లైబ్రే రియన్ ఆచార్య కొంగర సురేంద్రబాబు మాట్లాడుతూ, గ్రంథాలయ ఉద్యమ చరిత్రలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ ఉద్యమం కీలక పాత్ర పోషించిందన్నారు. 50 సంవత్సరాలుగా గ్రంథాలయ ప్రగతికి కృషిచేసిన దొరస్వామికి పాతూరి పురస్కారం రావడం గ్రంథపాలకు లకు స్ఫూర్తి అన్నారు. వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రత్నప్రసాద్ మాట్లాడుతూ, దొరస్వామి తమ కళాశాల గ్రంథాలయంలో అంకిత భావంతో పనిచేసి ఎంతో గుర్తింపు తీసుకువచ్చారన్నారు. సిద్ధార్థ లా కళాశాల ప్రిన్సిపాల్ దివాకర్‌బాబు మాట్లాడుతూ, వృత్తిలో నిబద్ధత, క్రమశిక్షణ కలిగి ఉండటమే దొరస్వామికి పురస్కారం లభించేలా చేసిందన్నారు. ఫౌండేషన్ కార్యదర్శి రావి శారద మాట్లాడుతూ, ఫౌండేషన్ గత చరిత్రను, పూర్వం ఈ పురస్కారానికి ఎంపికైన వారి వివరాలను, దొరస్వామిని ఎంపిక చేయడానికి కారణాలను వివరించారు. కార్యక్రమంలో పలువురు గ్రంథ పాలకులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొన్నారు.


రన్నరప్ ట్రోఫీ, మెడల్స్‌తో కృష్ణా జట్టు

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ విజేత అనంత

- కృష్ణా జిల్లా జట్టుకు రన్నరప్

విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 25 : ఎన్టీఆర్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో కానూరు 100 అడుగుల రోడ్డు అనుమోలు ప్రభాకర్ క్రీడా మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న రాష్ట్రస్థాయి(అంతర్ జిల్లాల) సబ్ జూనియర్ బాలుర ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ విజేతగా అనంతపురం నిలిచింది. కృష్ణాతో జరిగిన ఫైనల్స్‌లో అనంత పురం జట్టు ఆదివారం 5-0 గోల్స్ తేడాతో జయభేరి మోగించి ట్రోఫీని దక్కించుకుంది. అంతకుముందు తొలి సెమీస్‌లో నెల్లూరు-అనంతపురం జట్ల మధ్య జరగ్గా అనంతపురం 5-0తో గెలిచి ఫైనల్స్ చేరగా, రెండో సెమీస్ కృష్ణా-అన్నమయ్య జిల్లాల మధ్య జరగ్గా ట్రై బ్రేకర్‌లో కృష్ణా జట్టు విజయం సాధించి ఫైనల్స్‌కు చేరింది. మూడో స్థానంలో అన్నమయ్య జిల్లా నిలిచింది. ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ క్రాంతికుమార్, ట్రెజరర్ విజయ్‌కుమార్‌లు విజేతలకు ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సంవత్సరన్నరకాలంలో ఎన్టీఆర్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు చాంపియన్‌షిప్‌లను దిగ్విజయంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. 22 జిల్లాల నుంచి 460 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసి యేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వై.శేషగిరిరావు, బి.చక్రవర్తి, వివిధ జిల్లాల ప్రతినిధులు పి. అలీబాబా, పవన్, బుజ్జి, నీలాద్రి(కోనసీమ అధ్యక్షుడు), రిటైర్డు డీఎస్‌డీవో సుధాకర్, డీఎ ఎస్ఏ కోచ్ రవికుమార్‌లు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

- ఎమ్మెల్సీ ఏసురత్నం

ధర్నాచౌక్, ఆగస్టు 25 : వెనుకబాటుతనంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వడ్డెర కులాన్ని ఎస్టీ జాబితాలో చేర్చాలని ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం తెలిపారు. దీనిపై రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానించి కేంద్రానికి పంపి పార్లమెంట్‌లో తీర్మానించేలా కేంద్రప్రభ త్వంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రస్థాయి వడ్డెరల ప్రతినిధుల సమావేశం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఏసురత్నం, జాతీయ వడ్డెర సంఘం (వోడ్) అధ్యక్షుడు వెంకట్ మౌర్య మాట్లాడుతూ, జనాభా దమాషా ప్రకారం వడ్డెర కార్పొరేషన్‌కు రూ. 200 కోట్లు మంజూరు చేయాలన్నారు. స్వయం ఉపాధి రుణాలు అందించాలన్నారు. క్వారీల్లో వడ్డెరలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, ప్రభుత్వ కాంట్రాక్టు పనుల్లో డిపాజిట్ లేకుండా ఇవ్వాలన్నారు. నామినేషన్ పద్ధతిన 15 శాతం ప్రభుత్వ పనులు రిజర్వ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రముఖ స్వాతంత్ర సమ రయోధుడు వడ్డె ఓబన్న జయంతిని ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. వడ్డెరలకు రాజ కీయ ప్రాధాన్యత కల్పించాలన్నారు. సంఘం అడ్వైజర్ గుంజా నరసింహులు, జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి రాయపాటి అరుణ, విజయవాడ వడ్డెర సంఘం అధ్యక్షుడు బత్తుల నాగే శ్వరరావు, బత్తుల సంజీవ రాయుడు తదితరులు పాల్గొన్నారు.

కీలాద్రి కిటకిట..

- దుర్గమ్మ సేవలో భక్తజనం





వన్‌టౌన్, ఆగస్టు 25 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించుకుని, కృష్ణానదిలో పవిత్ర స్నానాలు చేశారు. కొండపైన క్యూలలో వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు పొంగళ్లు సమర్పించారు. ఆర్జిత సేవల్లో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి మహానైవేద్యం సందర్భంగా ఉదయం 11 నుంచి 1.30 గంటల వరకు ప్రోటోకాల్ దర్శనాలను నిలిపివేశారు. క్యూలై న్లలో భక్తుల రాకపోకలను ఈవో రామారావు, ఇతర అధికారులు క్రమబద్ధీకరించారు. అనధికార దర్శనాలను కట్టడి చేసేందుకు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

సూర్యోపాసన సేవ..

ఆదివారం సందర్భంగా దేవస్థానం అర్చకులు, వేదపండితులు సూర్యోపాసన సేవ నిర్వహించారు. సమస్త జనుల ఆయురారోగ్యాలను కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ, తదితర సేవలను నిర్వహించారు. సూర్యనారాయణ మూర్తి చిత్ర పటానికి పూజలు నిర్వహించారు.

అన్న వితరణకు విరాళం..

విజయవాడ భవానీపురానికి చెందిన ఎస్.మల్లికార్జునరావు, మాధవిలు కుటుంబ సభ్యులతో అమ్మవారిని దర్శించుకుని అన్నవితరణకు రూ.1,01,116లను చెక్కు అందజేశారు. వీరికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.


కరెన్సీ నోట్లతో అలంకరించిన ముత్యాలమ్మ

ధనలక్ష్మీగా ముత్యాలమ్మ..

పట్టణంలో గ్రామదేవత ముత్యాలమ్మ అమ్మవారిని శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా రూ.10లక్షల కరెన్సీ నోట్లతో శ్రీ ధనలక్ష్మీగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

- జగ్గయ్యపేట

కిడ్నీ పీడిత గ్రామాలకు సురక్షిత జలం



- శరవేగంగా కృష్ణా జలాల ప్రాజెక్టు పనులు
- 38 గ్రామాల ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు కృషి
- వచ్చే ఏడాది జూన్ 30కి ముందే పనుల పూర్తికి చర్యలు
- ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన

కృష్ణలంక, ఆగస్టు 25 : రాష్ట్ర ప్రభుత్వ ఆదే శాల మేరకు ఎ.కొండూరు మండలంలోని అన్ని గ్రామాలకు సురక్షిత కృష్ణా జలాలను అందించేం దుకు ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం తలపెట్టిన ప్రాజెక్టు పనులు శరవేగంగా సాగుతున్నట్టు కలెక్టర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 38 గ్రామాల ప్రజలకు శాశ్వత ప్రాతిపదికన కృష్ణా సురక్షిత మంచినీటిని అందించేందుకు రూ.49.94 కోట్ల వ్యయంతో చేపట్టిన పనులను వచ్చే ఏడాది జూన్ 30 నాటికి పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా అంతకుముందే పనుల పూర్తికి అధికార యంత్రాంగం కృషిచేస్తున్నట్టు వెల్లడించారు. దీని కోసం గ్రామీణ నీటిసరఫరా పరిధిలో పటిష్ఠ కార్యా చరణ ప్రణాళిక రూపొందించి, అమలుచేస్తున్నట్టు వివరించారు. కృష్ణాజలాలు ప్రస్తుతం, మైలవరం సీపీడబ్ల్యూసీ స్కీమ్ వరకు వస్తున్నాయని, ఇక్కడి నుంచి కుదపలోని సంప్ దగ్గరకు జలాలను తీసుకె ళ్తున్నట్టు తెలిపారు. ప్రాజెక్టు పనులు పూర్తి అయ్యేవ రకు కృష్ణా నీటిని ట్యాంకర్ల ద్వారా మండలంలోని గ్రామాలకు అందిస్తున్నట్టు వివరించారు. ప్రాజెక్టు పనులు పూర్తయ్యేవరకు తాత్కాలికంగా ట్యాంకర్ల ద్వారా కిడ్నీ వ్యాధుల ప్రభావిత గ్రామాలకు సురక్షిత మంచినీటిని అందించేందుకు చర్యలు తీసుకున్నా మని, ఇటీవల రూ.1.60 కోట్ల డీఎంఎఫ్ గ్రాంట్స్ కూడా విడుదల చేసినట్టు వివరించారు.

శాశ్వత ప్రాజెక్టు ఇలా..

శాశ్వత ప్రాజెక్టు కింద కుదప సంప్ దగ్గర కొండపై ఓవర్ హెడ్ రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నామ న్నారు. సంప్ నుంచి కృష్ణా జలాలను శుద్ధి చేసి ఓవర్ హెడ్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తారు. అక్కడి నుంచి ఎ.కొండూరు మండలంలోకి 38 కిడ్నీ ప్రభావిత గ్రామాలకు పైపులైన్లు, డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ల ద్వారా నీరు సరఫరా జరుగుతుంది. ఓవర్ హెడ్ రిజర్వాయర్ పనులు 200 కి.మీ పూర్తికాగా, మరో 70 కి.మీ పనులు చివరి దశలో వున్నాయి. 38 గ్రామాల్లో అందుబాటులో వున్న ఓవర్ హెడ్ రిజర్వా యర్లకు అదనంగా మరో 14 ఓవర్ హెడ్ రిజర్వాయ ర్లను ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్నామని, ఈ పను లను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, అతిత్వరలో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని కలె క్టర్ సృజన తెలిపారు.

ఆరోపణల గుట్టు తేల్చండి

- కలెక్టర్‌కు ఎమ్మెల్యే కొలికపూడి లేఖ
- సోషల్ మీడియాలో వైరల్



ఎ.కొండూరు, ఆగస్టు 25 : ఎ.కొండూరు తహసీల్దార్ బి.ఆశయ్య తనపై చేసిన ఆరోపణలపై కలెక్టర్ విచారణ చేయాలని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ సృజనకు ఎమ్మెల్యే లేఖ రాశారు. కొద్దిరోజుల క్రితం ఎ.కొండూరు తహసీల్దార్ కార్యాల యంలో సీపీఐ నాయకులతో దాదాపు గంటసేపు పిచ్చాపాటి కబుర్లు చెప్పిన తహసీల్దార్ తిరువూరు ఎమ్మెల్యే ఒక వ్యక్తి నుంచి రూ.50 లక్షలు తీసుకున్నాడని మాటల మధ్యలో చెప్పారని, ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్వయంగా తహసీల్దార్‌కు ఫోన్ చేసి అడగ్గా సీపీఐ నాయకులే తనకు చెప్పారని తహసీల్దార్ వివరణ ఇచ్చారు. తనపై తహసీల్దార్ బి.ఆశయ్య చేసిన ఆరోపణలపై సమగ్ర విచారణ చేసి వాస్త వాలు బయటపెట్టాలని కలెక్టర్‌ను కోరినట్టు ఎమ్మెల్యే కొలిక పూడి రాసిన లేఖ ప్రతిని సోషల్ మీడియాలో పోస్టు చేశారు. దీంతో ఈ విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది.

మహిళల ఆర్థిక పురోభివృద్ధికి కృషి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని స్వయం సహా యక సంఘాల్లో సభ్యులను కేంద్ర ప్రభుత్వం చేయూతతో లక్షాధికారులుగా చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. 'లఖ్‌పతి దీదీ సమ్మేళన్' కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి మోదీ మహారా ష్ట్రలోని జలావ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆదివారం పాల్గొన్నారు. కలెక్టరే ట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలునుంచి వర్చువల్ పద్ధతిలో కలెక్టర్, జిల్లా అధి కారులు, డ్వాక్రాసంఘాల సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 77,121 మంది డ్వాక్రా మహిళలను లక్షాధికారులుగా చేసే లక్ష్యంతో పనిచేస్తు న్నట్టు తెలిపారు. ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్ర బాబు 'లఖ్‌పతి దీదీ' కార్యక్రమాన్ని సెర్ప్‌కు అనుసంధానం చేస్తామని చెప్పార న్నారు. దీంతో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించామన్నారు. డ్వాక్రా సభ్యులకు రుణసదుపాయం కల్పించి వారి జీవ నోపాధిని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నెలవారీ ఆదాయం రూ.10వేలకన్నా తక్కువగా ఉన్నవారిని గుర్తించి, వారికి ప్రభుత్వ పథ కాలను చేరువచేసి, వివిధ వృత్తుల్లో నైపుణ్యం పెంచుకునేలా తగిన శిక్షణ కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని 294 డ్వాక్రాసంఘాలకు రూ.45.40కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు, 460గ్రూపులకు రూ. 6.18కోట్ల సామా జిక పెట్టుబడి నిధి రుణాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ నాగేశ్వరనాయక్, జిల్లాసమాఖ్య అధ్యక్షురాలు తోట నాగమునిమ్మ, కోశాధికారి ఎస్.రాజకుమారి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ



భవానీ ద్వీపానికి మరిన్ని సొబగులు!

- పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి : పశ్చిమ ఎమ్మెల్యే సుజనా

విద్యాధరపురం, ఆగస్టు 25 : పర్యాటక ప్రాంతమైన భవానీద్వీ పాన్ని మరింత అభివృద్ధి చేయటమే లక్ష్యంగా కృషి చేస్తానని విజయ వాడ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనాచౌదరి) అన్నారు. ఆదివారం సాయంత్రం కూటమి నేతలతో కలిసి భవానీపురంలోని భవానీద్వీ పాన్ని ఆయన సందర్శించారు. ద్వీపాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఏపీ టూరిజం అధికారులు, సిబ్బం దితో అక్కడ ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పర్యాటకు లతో మాట్లాడి సమస్యలు, సలహా లను తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భవా నీద్వీపం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని పర్యాటక అధికారి పి.ఎస్.కె. కృష్ణ చైతన్యను కోరారు. ద్వీపంలో అనేక అవకాశాలు, వన రులు ఉన్నప్పటికీ గత వైసీపీ ప్రభుత్వం భవానీద్వీప అభివృద్ధిని విస్మ రించిందన్నారు. ఇంద్రకీలాద్రిని ఆధ్యాత్మిక క్షేత్రంగా మార్చటంతో పాటు భవానీద్వీపాన్ని కూడా అభివృద్ధి చేసి పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తా మన్నారు. కార్యక్రమంలో బరంపార్క్ యూనిట్ మేనేజర్ శ్రీనివాసరావు, భవానీద్వీపం మేనేజర్ సుధీర్, కూటమి నాయకులు బొమ్మసాని సుబ్బారావు, ఎంఎస్ బేగ్, అడ్డూరి శ్రీరామ్, పైలా సోమినాయుడు, తది తరులు పాల్గొన్నారు.


భవానీద్వీపంలో పర్యాటకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతమే లక్ష్యం

గొల్లపూడి : క్షేత్రస్థాయి నుంచి పార్టీ బలోపేతమే లక్ష్యంగా ముందుకు సాగుదామని అందుకు ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త వారి పూర్తి సహకారం అందించాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. గొల్లపూడిలోని ఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఆదివారం ఎన్టీఆర్ జిల్లా అధ్య ర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్ర మంపై అవగాహన నిర్వహించారు. సెప్టెంబరు 1న ప్రధాని నరేంద్ర మోదీ తన బీజేపీ సభ్యత్వంను పునరుద్ధరించు కొని సభ్యత్వ నమోదును లాంఛనంగా ప్రారంభించనున్నట్టు చెప్పారు. వికసిత్ భారత్ 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం సాధించాలనేది ప్రధాని సంకల్పం అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి సహకారంతో తనకు 47 వేలకు పైగా మెజార్టీ వచ్చిందని, ఓటు వేయని వారిని కూడా అక్కున చేర్చు కుంటానన్నారు. తనకంటూ ప్రత్యర్థులు ఎవ్వరూ లేరని అందరూ మిత్రులే అన్నారు. ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ, సభ్యత్వ నమోదును ప్రతి నాయకుడు బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ, రాజమండ్రి ఇన్‌చార్జి భగవాన్, నూతులపాటి బాలకోటే శ్వరరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కీచక టీచర్‌పై కేసు

ఈడుపుగల్లు(కంకిపాడు), ఆగస్టు 25 : ఈడుపు గల్లు ఎంపీపీ పాఠశాలలో చదువుతున్న బాలిక పట్ల అస భ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై కంకిపాడు స్టేష న్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. ఈడుపుగల్లు ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యా యుడిగా పనిచేస్తున్న మండవ వెంకటశ్రీనివాస్ పాఠశా లలో బాలిక పట్ల కొంతకాలంగా అసభ్యంగా ప్రవర్తించ డంతో బాలిక తల్లిదండ్రులకు తెలిపింది. బాలిక తల్లి ఫిర్యా దుమేరకు ఉపాధ్యాయుడిపై పోక్సో కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సందీప్ తెలిపారు.

విషజ్వరంతో బాలుడి మృతి

గంపలగూడెం : గాదేవారిగూడేనికి చెందిన సంధ్యాల నాగరాజు కుమారుడు 11 నెలల బాలుడు ఆదివారం విష జ్వరంతో మృతి చెందాడు. తిరువూరులో ఒక ప్రయివేటు ఆసుపత్రిలో బాలుడికి వైద్యం చేయించి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా అక్కడ మృతి చెందినట్టు కుటుంబసభ్యులు తెలిపారు.

సమాజంలో మీడియా పాత్ర ప్రాధాన్యం

- పాత్రికేయుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 : సమాజంలో మీడియా పాత్రకు ఎంతో ప్రాధాన్యత ఉందని, పాత్రికేయుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పౌర సంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వ ర్యంలో మచిలీపట్నం ఆర్కె ప్యారడైజ్‌లో కృష్ణాజిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపా ధ్యక్షుడు మన్నే సోమేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో డిడి వెంకటేశ్వరప్రసాద్ అతిధిగా పాల్గొని ప్రసంగించారు. మంత్రులు కె.పి. సారథి, కొల్లు రవీంద్రల సందేశాన్ని వినిపించారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు, ఇళ్లు, అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామని మంత్రులు చేసిన వాగ్దానాన్ని వినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా మత్తి శ్రీకాం త్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి మల్లికార్జు నరావు, వై.వెంకటరమణ, చైతన్య, విజయకుమార్ తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న పబ్లిక్ రిలేషన్స్ డిడి వెంకటేశ్వర ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధరరావు

గంజాయి గుట్టురట్టు

- ఐదుగురి అరెస్టు
- రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధరరావు వెల్లడి

గుడివాడ, ఆగస్టు 25 : గంజాయి రవాణా, విక్రయం, వినియోగాన్ని ఎవరైనా ప్రోత్సహిస్తే కఠిన శిక్షలు తప్పవని కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో ఇటీవల పట్టుకున్న ప్రధాన సప్లయిదారుడు, నలుగురు గంజాయి విక్రేతలను మీడియా ఎదుట హాజరుపరి చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఈ నెల 19న గుడివాడ శివారు శ్రీకాళహస్తి కాలనీ వద్ద అను మానాస్పదంగా సంచరిస్తున్న కొందరు యువకులను పట్టుకోగా, 6.300కిలోల గంజాయి దొరికిందని, ఇద్దరు పారిపోయారని, ఒక మైనర్‌ను అదుపులోకి తీసుకున్నా మన్నారు. ఆదివారం రూరల్ మండలం వలివర్తిపాడు గ్రామ శివారులోని ఇటుక బట్టీల వద్ద పొదల్లో ఉన్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారిలో సీలేరుకు చెందిన గంజాయి సప్లయిదారుడు కోడా నీలందారావు, పెదపారుపూడికి చెందిన జగన్నాథం లోకేష్, గుడివాడకు చెందిన చల్లా యేసు, బండారు తిరుపతి, మరో మైనరును ఉన్నారన్నారు. వీరి నుంచి రెండు బైక్‌లు, మూడు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసు కున్నట్లు తెలిపారు. గంజాయిని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా, డివిజన్ స్థాయిలో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసామన్నారు. గంజాయి నిందితులను పట్టు కోవడంలో చొరవ చూపిన వారికి నగదు పురస్కారా లను అందజేశారు. సమావేశంలో సీసీఎస్ డీఎస్పీ ఎ.సుబాష్, సీఐలు ఎస్.ఎల్.ఆర్ సోమేశ్వరరావు, రమ ణమ్మ, మోజెస్, ఎస్ఐలు ఎన్.చంటిబాబు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన దృశ్య వేదిక ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్, ఆగస్టు 25 : దృశ్య వేదిక సంస్థ అధ్వ ర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరిం చాయి. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాల యంలో ఆదివారం సాయంత్రం శ్రీకృష్ణ నృత్య కదంబం, అమృతహస్త నాటిక ప్రదర్శనలు ఆహూతులను మైమరిపించాయి. శ్రీ నిత్య కళాని లయం నాట్య విద్యార్థులు సత్యానందిని, కావ్య, హేమస్రీ, లావణ్య, ఆసిక, శైలజ, కాత్యాయని, రాస్య, హాషిత ఖ్యాతిలు శ్రీ కృష్ణాష్టమి పుర స్కరించుకొని కృష్ణతత్వంను తెలియజేసే కూచిపూడి నాట్య ప్రదర్శనలు ప్రద ర్శించి నయనానందకరం చేశారు. నాట్యాచారిని గోను గుంట శైలజశ్రీ పర్యవేక్షిం చారు. తదుపరి ప్రదర్శిం చిన అమృత హస్తం నాటిక ప్రేక్షకులను ఆలోచింపచే సింది. ఒక తల్లి కడుపున పుట్టిన అన్నా చెల్లెలు ప్రేమ అనుబంధాలు చాలా గొప్ప వని, సమాజంలో మృగ్యం అయిపోతున్న ఇలాంటి బంధాలు ఎంత అవసరమో సమాజానికి గుర్తు చేయడం అనే ప్రధాన అంశంగా సందేశాత్మకంగా ఈ నాటిక సాగింది. కావూరి సత్యనారాయణ, ఏపూరి హరిబాబు, సరిత, మాధవి, గోపాలరెడ్డిలు ప్రధాన పాత్రలు పోషించి మెప్పించారు. సాయితేజ సంగీతం అందించగా శ్రీధర్ ఆహార్యంతో సహకారం అందించారు. కార్యక్రమాన్ని నిర్వాహకులు హెచ్‌వీఆర్ఎస్ ప్రసాద్ పర్యవేక్షించారు.


శ్రీకృష్ణ లీలలు నాట్యాన్ని ప్రదర్శిస్తున్న గోనుగుంట శైలజ శిష్య బృందం


'అమృత హస్తం' నాటకంలో ఓ సన్నివేశం

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

బండారుగూడెంలో సీపీఎం జెండా ధ్వంసం



హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 25 : బండారుగూడెంలోని సీపీఎం జెండా దిమ్మపై గల జెండా కర్రతో పాటు జెండాను ధ్వంసం చేసిన ఘటన ఆదివారం జరిగింది. బండారుగూడెంలో ప్రధాన రహదారి వెంబడి ఉన్న సీపీఎం దిమ్మపై ఎగురుతున్న జెండాను ఇనుపరాడ్‌తో సహా విరగ్గొట్టి ప్రక్కన పడేశారు. గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి ఈ చర్యకు పాల్పడి ఉంటారని సీపీఎం నాయకులు బద్రె లెనిన్, పామర్తి అప్పయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూటమి పథకాలకు ప్రజాదరణ

ఎమ్మెల్యే బోడె ప్రసాద్



టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 25 : సైకో ప్రభుత్వానికి చరమగీతం పాడి అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం.. అధికారం చేపట్టిన అనతికాలంలోనే ప్రజాకర్షక పథకాలతో ప్రజల అభిమానం చూరగొన్నదని స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పోరంకి టీడీపీ కార్యాలయంలో స్థానిక నాయకులు చలమల జోజికుమార్, పడమట అమలేష్‌లు టీడీపీలో చేరుతున్న సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న చాలా మంది నాయకులు టీడీపీ, ఇతర పార్టీలలోకి చేరేందుకు ఉత్సుకత చూపిస్తున్నారని, త్వరలోనే వైసీపీ ఖాళీ బోర్డు పెట్టుకుంటుందని పేర్కొన్నారు. టీడీపీ కూటమి జనాకర్షక పథకాలు, అమరావతి నిర్మాణానికి పూనుకోవడం, జగన్‌రెడ్డి పట్ల వైసీపీ శ్రేణులు విశ్వాసం కోల్పోవడం తదితర కారణాలతో తాము టీడీపీ కండువా కప్పుకుంటున్నట్లు జోజికుమార్, అమలేష్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వేమూరి ప్రసాద్, ఆకునూరి సుబ్బారావు, ఘంటమనేని నాగబాబు, అంగిరేకుల మురళి, చలసాని రాము, తుమ్మలపల్లి హరికృష్ణ, యార్లగడ్డ నాని, కోలా ప్రసాద్, ఎడ్లూరి శౌరిబాబు, బొంగరాల అబ్రహాం, జంగం కుమార్, బేతపూడి రాజేష్, గరికపూడి రాము, దయాల ఏసుపాదం, దొడ్డా హరి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌కు రూ.25,116 విరాళం

రాష్ట్ర ప్రభుత్వం అన్నార్తుల ఆకలి తీర్చేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ల నిర్వహణకు తన వంతుగా కలవపాములకు చెందిన టీడీపీ నాయకులు ఘంటా విష్ణువర్ధన్‌రావు ఆదివారం రూ. 25,116ల చెక్కును ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ పట్ల అభిమానంతో తమవంతు సాయంగా విరాళంగా అందించిన విష్ణువర్ధన్‌రావును ఆదర్శంగా తీసుకొని మరింత మంది అన్న క్యాంటీన్లకు సహకారం అందించాలని కోరారు. విష్ణువర్ధన్‌రావును ఆయన అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు కోయ ఆనంద్ ప్రసాద్, అంగిరేకుల మురళి, వల్లభనేని నాని, చలసాని రాము, సుంకర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

ఉయ్యూరు, ఆగస్టు 25 : కడవకొల్లు గ్రామ పంచాయతీ పొట్లపాడు శివారులో ఆదివారం కోడిపందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకుని కోడిపుంజు, కోడికత్తి, రూ. 4,800 నగదు స్వాధీన పరుచుకున్నట్టు ఉయ్యూరు రూరల్ ఎస్సై కొండపల్లి సురేశ్‌బాబు తెలిపారు. గ్రామాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, జూదాలు, కోడిపందేలు నిర్వంచే వారిని ఉపేక్షించేది లేదని ఎస్సై ఈ సందర్భంగా హెచ్చరిచారు.

కల్యాణమస్తు కానుక అందజేత



నూతన దంపతులకు గోల్డ్ కాయిన్ అందజేస్తున్న చలసాని ఆంజనేయులు, పాలడుగు నాని

గన్నవరం, ఆగస్టు 25 : పాడి రైతుల శ్రేయస్సు విజయ డెయిరీ లక్ష్యమని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. ఆదివారం గన్నవరం ఏబీ కల్యాణ మండపంలో సూరంపల్లి పాలకేంద్రం మాజీ అధ్యక్షుడు కాసరనేని సత్యనారాయణ కుమారుడి వివాహ సందర్భంగా విచ్చేసి నూతన దంపతులు ధన శ్రీరామ్, మేఘనను ఆశీర్వదించి వారికి కల్యాణమస్తు పథకం ద్వారా నాలుగు గ్రాముల గోల్డ్ కాయిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా డైరెక్టర్ పాలడుగు నాని, గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసన్నేని రంగబాబు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

వైభవంగా గంగానమ్మ జాతర



ప్రత్యేక పూజ నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 25 : పెరికీడులో గంగానమ్మతల్లి జాతర ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పోతురాజు కర్రను మేళతాళాల మధ్య గ్రామవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ సేవకులు జెట్టి సీతమ్మతో కలిసి మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. అర్చకులు శ్యామ్ ఆధ్వర్యంలో పుట్టి కోటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నండూరి శర్మ, నక్కాబాబు, పుట్టి వీర్రాజు, రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ జిమ్ ప్రారంభం రేపు



ప్రారంభానికి సిద్ధంగా జిమ్

గన్నవరం, ఆగస్టు 25 : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ ప్రారంభానికి సిద్ధంగా ఉంది. దీనికి ఎంపీ వల్లభనేని బాలశౌరి నిధులు రూ.7లక్షల మంజూరు చేశారు. ఆ నిధు లతో పరికరాలు కొనుగోలు చేసి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ పర్యవేక్షణలో ఓపెన్ జిమ్ పనులు పూర్తి చేశారు. క్రీడా ప్రాంగణంలోకి వాకింగ్ చేసేందుకు వందలాది మంది వస్తున్నారు. వారి ఆరోగ్య ప్రయోజనాల కోసం జిమ్‌ను ఏర్పాటు చేశారు. వీరిని ఈ నెల 27వ తేదీన ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చేతుల మీదుగా ప్రారంభిస్తారని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ తెలిపారు.

ఉపాధ్యాయులకు స్ఫూర్తి చిన్నప్ప



చిన్నప్ప చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 25 : దశాబ్దాల పాటు ఉపాధ్యాయుడిగా విశేషసేవలందించడంతో పాటు యూటీఎఫ్ బలోపేతానికి కృషి చేసిన వేమూరి చిన్నప్ప అంకితభావం నేటితరం ఉపాధ్యాయులకు స్ఫూర్తి అని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు అన్నారు. హనుమాన్ జంక్షన్‌లోని సీఐటీయూ ఆవరణలో కామ్రేడ్ వేమూరి చిన్నప్ప సంస్మరణ సభ ఆదివారం నిర్వహించారు. చిన్నప్ప చిత్రపటానికి ఎంపీపీ యర గొర్ల నగేష్, జెడ్పీటీసీ కొమరవల్లి గంగాభవాని, చలమలశెట్టి రమేష్‌బాబు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కనకరావు, మానవత రాష్ట్ర కార్యదర్శి మారుబోయిన కోటేశ్వరరావు, నరహరిశెట్టి బాబూరావు, వెలమర్తి రవిబాబు, జగతి, నాగరాజు, శ్రీహరి, రమణగోపాల్, అక్కినేని రాఘవేంద్రరావు, దారపురెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కృష్ణాష్టమి వేడుక

ఉయ్యూరు, ఆగస్టు 24 : కృష్ణాష్టమి వేడుకలను శ్రీ ఎంకె ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆవరణలో ఆదివారం ఆనందోత్సాహాలతో నిర్వహించారు. చిన్నికృష్ణుడు, గోపికల వేషాధారణలో బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో బాలలు పోటీ పడ్డారు. కృష్ణాష్టమి విశిష్టతను స్కూల్ డైరెక్టర్ ఎంకె బాబు విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.



ఉట్టికొడుతున్న బాలలు

మారని అధికారుల తీరు!

● పెదఓగిరాల ఆర్బీకే గోడపై తొలగించని నవరత్నాల లోగో



పెద ఓగిరాల(ఉయ్యూరు), ఆగస్టు 25 : ప్రభుత్వం మారినా, మారని అధికారుల తీరుపై టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పెదఓగిరాలలో రైతు భరోసా కేంద్రం గోడలపై వైసీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాలు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిలోగో దర్శన మిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం మారి, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులు కావస్తున్నా, ప్రభుత్వ కార్యాలయాలపై మాజీ ముఖ్యమంత్రి చిత్రపటాలు దర్శనమిస్తున్నా అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన అధికారులు, ఉద్యోగులు ప్రభుత్వ మారినా అదేరీతిన వ్యవహరించడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారుల తీరు మార్చుకోని నవరత్నాల లోగోను మార్చాలన్నారు.

రైలు నుంచి జారిపడి అంధుడు మృతి

ఉంగుటూరు, ఆగస్టు 25 : పెదఅవుటపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో రైలు నుంచి ప్రమాదవశాత్తూ విజయవాడ వించిపేటకు చెందిన భిక్షాటన చేసుకునే ఈబుధి నాగరాజు(48) అనే అంధుడు జారిపడినట్టుగా ఏలూరు రైల్వే పోలీసులు గుర్తించారు. ఇతను పుట్టుకతో అంధుడని, గత 30 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటూ ప్రతి రోజూ రత్నాచల్, సింహాద్రి, జన్మభూమి, కాకినాడ-తిరుపతి రైళ్లలో భిక్షాటన చేస్తూ జీవనం సాగించేవాడని, అతని తోటి మిత్రుడు అయిన బొమ్మిని గుర్రప్ప ద్వారా రైల్వే పోలీసులు తెలుసుకున్నారు. ఇరువురు అంధులు కలిసి ఎప్పటిలాగే ఆదివారం ఉదయం సుమారు ఆరు గంటల సమయంలో విజయవాడలో రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. జనరల్ బోగీలో భిక్షాటన చేస్తూ పెదఅవుటపల్లి రైల్వేస్టేషన్ దగ్గర్లో ప్రమాదవశాత్తూ రైలునుంచి జారిపడి నాగరాజు మృతి చెందాడు. రైలులో ప్యాంట్రీకార్‌లో పనిచేసే వ్యక్తి ద్వారా నాగరాజు జారిపడ్డ విషయం తెలుసుకున్న గుర్రప్ప తోటి మిత్రుల సహకారంతో ఏలూరులో రైల్వే పోలీసులకు సమాచారం తెలిపాడు. ఏలూరు రైల్వే ఎస్సై పి.సైమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టిడ్కో కాలనీలో కార్డెన్ సెర్చ్

గుడివాడ : ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు ఆదివారం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్సై ఎన్.చంటిబాబు మాట్లాడుతూ, ఎస్పీ ఆదేశాలు, ఇన్‌చార్జ్ డీఎస్పీ పర్యవేక్షణలో కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్‌ల కదలికలపై ప్రత్యేకనిఘా ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ, మద్యం అక్రమ రవాణ నివారణ, పాత కేసుల్లో నిందితుల ఇళ్లలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. పత్రాలు లేని 33 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు.

ఆహారపు అలవాట్ల మార్పుతో సంపూర్ణ ఆరోగ్యం



ఆరోగ్య అవగాహన సదస్సులో మాట్లాడుతున్న రామచంద్ర

ఉయ్యూరు, ఆగస్టు 25 : ఆహారంలో కొద్దిపాటి మార్పుల ద్వా రా ఇంటి వద్దనే సంపూర్ణ ఆరో గ్యం పొందవచ్చని సిద్ధార్థ యోగా విద్యాలయ ప్రకృతి వైద్య నిపుణుడు రామచంద్ర అన్నారు. స్థానిక ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో సి ద్ధార్థ యోగా విద్యాలయం ఉయ్యూరు శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆయన పాల్గొని ఆరోగ్యం, ప్రకృతివైద్యం, ఆరోగ్యానికి, వ్యాధుల నివారణకు ఆహారపు అలవాట్లపై సవివరంగా తెలియజేశారు. పురుషులతో పాటు మహిళల్లో అనారోగ్య సమస్యలు తీసుకోవాలిసిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లు, ప్రకృతివైద్యం. ఆహారమే ఔషధం ఇతర అంశాలపై ప్రకృతి వైద్య నిపుణులు పద్మ తెలియజేశారు. కాగిత గోపాలకృష్ణ, ఈఎల్ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో లయన్స్ క్లబ్ ప్రతినిధులు నూకల సాంబశివరా వు, కుటుంబరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

పమిడిముక్కల ఎస్సైగా శ్రీను



పమిడిముక్కల : పమిడిముక్కల ఎస్సైగా బి.శ్రీను ఆదివారం బాధ్యతలు చేపట్టారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, కోడి పందేలు వేసే వారు, నిర్వహించే వారి సమాచారం అందించి సహకరించాలని ఎస్సై విజ్ఞప్తి చేశారు.

కౌతవరంలో లయన్స్ వైద్యపరీక్షలు

గుడ్లవల్లేరు : లయన్స్ ఆధ్వర్యంలో కౌతవరంలో కానూరి ట్రస్టు చైర్మన్ కానూరి సత్యనారాయణ ప్రసాద్ (సత్తిబాబు) వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గుడివాడ నవ్యసాయి పిల్లల ఆసుపత్రి డాక్టర్ ఏ.శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ గుత్తా శ్రీ శ్రావ్య బృందం 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కృష్ణ మల్టీసెపషాలిటీ డెంటల్ డాక్టర్ అట్లూరి విద్యాసాహితి 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు శశికళ, కార్యదర్శి మేరుగు పెరుమాళ్ళు, కోశాధికారి నవాబు, వైపిసి ప్రసాద్, చాపరాల బాలాజీ పాల్గొన్నారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలి

● జ్వర పీడితుల వివరాలు సేకరించి, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయండి
● అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాలు



అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, ఆగస్టు 25 : నియోజకవర్గంలోని గ్రామాల్లో పారి శుధ్య చర్యలు తక్షణమే చేపట్టాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అధికారులను ఆదేశించారు. పలు గ్రామాల్లో జ్వరపీ డితులు అధికంగా ఉన్నారని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. ఆదివారం సాయంత్రం జిల్లా వైద్యాధికారి డాక్టర్ గీతాబాయి, డీపీవో నాగేశ్వరరావు నాయక్, ప్రభుత్వ వైద్యులు, పంచాయతీ కార్యదర్శులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, గ్రామాల వారిగా ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర బాధితుల వివరాలు నమోదు చేసి తనకు అందజేయాల న్నారు. వివరాలు ఎక్కువగా ఉంటే నివారణ చర్యలు తీసుకోకుండా ఏం చేస్తున్నారని సున్నితంగా మందలించారు. జ్వరపీడితులు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో తక్షణమే వైద్యశిబిరాలు నిర్వహించి రోగులకు మందులు అందిం చటంతో పాటు వైద్య సలహాలు సూచనలు ఇవ్వాలని కోరారు. తీవ్రజ్వరంతో బాధపడుతున్న వారిని మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలలకు పంపించాలన్నారు. మంగళవారం ఉదయం పూర్తి వివరాలు, తీసుకున్న చర్యలతో తన క్యాంపు కార్యాలయంలో జరిగే సమీక్ష సమావేశానికి రావాలని కోరారు. అవసరమైతే ప్రైవేటు వైద్యుల సహకారంతో వైద్య శిబిరాలు నిర్వహించి, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు పాటు పడాలని పిలుపునిచ్చారు. సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించి జ్వర పీడితుల వివరాలు నమోదు చేసి రోగులకు మందులు అందిస్తామని వైద్య అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. అన్ని గ్రామాల్లో ఉదయం 11 గంటలకు బ్లీచింగ్ చల్లి, డ్రెయినేజీలు శుభ్రం చేసి దోమల నివారణకు చర్యలు తీసుకుంటామని డీపీవో తెలిపారు. గతంలో తెంపల్లిలో డయేరియాతో ఆరుగురు మృతి చెందారని అటువంటి దుస్థితి పునరావృతం కాకూడదన్నారు. సక్రమంగా పని చేసేవారిని ప్రోత్సహిస్తానని, విధి నిర్వహణలో అలసత్వం, బాధ్యత రాహిత్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే యార్లగడ్డ హెచ్చరించారు.

టీటీడీకి కూరగాయలు పంపటం మహాభాగ్యం

నిత్య అన్నదానానికి కూరగాయలు పంపించటం మహాభాగ్యంగా భావించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. స్థానిక వెంకటేశ్వరస్వామి దేవస్థానం వద్ద శ్రీవారి భక్త సమాజం, గన్నవరం వారి ఆధ్వర్యంలో టీటీడీకి 11 టన్నుల కూరగాయల వాహనానికి మంగళవారం పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, భక్తులు ఎంతో భక్తిభావంతో కూరగాయలు పంపటం అభినందనీయ మన్నారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, దొంతు చిన్న, గూడపాటి తులసీమోహన్, మండవ ప్రభా కరరావు, తుమ్మల మురళీకృష్ణ, నెక్కలపూడి ఈశ్వరరావు, కాసన్నేని గోపాలరావు, సర్పంచ్ నిడమర్తి సౌజన్య, కొనసాని నాగేశ్వరరావు, కాసన్నేని బాబూరావు, జాస్తి నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది కేవీ రమణ పాల్గొన్నారు.

మైక్ విజయ్ మృతి తీరని లోటు

మండలంలోని బీబీగూడెం గ్రామానికి చెందిన నల్లమోతు విజయరావు (మైక్ విజయ్) ఆకస్మిక మృతి తనను కలచివేసిందని, టీడీపీకి తీరని లోటు అని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. శనివారం విజయ్ గుండెపో టుకు గురై మృతి చెందగా ఆదివారం ఆయన భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ, 2017లో తను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తన వెనుకే ఉన్నాడని గుర్తు చేసుకున్నారు. గతేడాది టీడీపీలో చేరినప్పుడు తనతో పాటు పార్టీలో చేరి విజయానికి ఎంతో కృషి చేశాడని చెప్పారు. విజయ్ మరణాన్ని జీర్ణించుకోలేక పోతున్నట్లు యార్లగడ్డ తెలిపారు. టీడీపీ నాయకులు బోయపాటి బసవపూర్ణయ్య, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	220
చికెన్ స్కిన్‌లెస్	230

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.4.75



సత్యసాయి సేవా మార్గం ఆచరణీయం

మచిలీపట్నం టౌన్ : సత్యసాయి బోధించిన సేవ, ప్రేమ మార్గాలు అనుసరణీయమని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గగోపు సత్యనారాయణ అన్నారు. బందరు మండలం కానూరు గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ సి. సాయిప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకటేశ్వరరావు, డాక్టర్ టి. పవన్, ఏ. శ్రీదుర్గ, జాహ్నవి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ హెచ్. విఠల్‌కుమార్, సమన్వయకర్త గోవర్ధనగిరి రాజు, ప్రతినిధులు పోతుకూచి ఆంజనేయకుమార్, కొమరగిరి శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో బారులు తీరిన భక్తులు



జస్టిస్ కృష్ణమోహన్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఈవో

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఒకరోజు ఆదాయం రూ.9.06 లక్షలు

మోపిదేవి, ఆగస్టు 25 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి. శ్రావణ మాసం ఆదివారం ప్రత్యేకత కావటంతో భక్తులతో కిటకిటలాడింది. స్వామివారి దర్శనం కోసం బారులు తీరారు. నాగపుట్టలో పాలుపోసి ఆలయ ప్రాంగణంలోని నాగవల్లి వృక్షం వద్ద ముడుపులు కట్టి స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. స్వామి వారికి ఆదివారం ఒక్కరోజు టికెట్లు, నామకరణం, అక్షరాభ్యాసం, అన్నప్రాసన, శాంతి కల్యాణం వంటి నిత్య పూజా కార్యక్రమాల ద్వారా రూ.9,06,126 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈవో ఎన్.ఎస్. చక్రధరరావు ఆధ్వర్యంలో సహాయక ఉద్యోగులు భక్తులకు అవసరమైన ఏర్పాట్లు పర్యవేక్షించారు.

స్వామి సేవలో జస్టిస్ కృష్ణమోహన్

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. వేద పండితులు ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో సత్కరించారు. ఈవో ఎన్.ఎస్.చక్రధరరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

అవనిగడ్డ మండల సమైక్యలో కలకలం

- వేకనూరు సీసీ పరంజ్యోతి సస్పెన్షన్
- గోప్యంగా ఉంచిన అధికారులు
- అక్రమాలు దాచిపెట్టే యత్నం

అవనిగడ్డ, ఆగస్టు 25 : అవనిగడ్డ మండల సమైక్య సీసీ సస్పెండ్ వ్యవహారం కలకలం సృష్టించింది. వేకనూరు సీసీగా పని చేస్తున్న టి.పరంజ్యోతిని సస్పెండ్ చేస్తూ ఈనెల 20వ తేదీన జిల్లా సమైక్య ఉత్తర్వులు జారీ చేయగా, ఉత్తర్వులు వెలువడి ఐదు రోజులు గడిచినా బహిర్గత పర్చకుండా అధికారులు రహస్యంగా ఉంచటం పలు అనుమానాలకు తావిచ్చింది..

సీఐఎఫ్, స్త్రీ నిధి, ఉన్నతి నిధుల రికవరీ విషయంలో నిర్లక్ష్య ధోరణి, ఆర్థిక లావాదేవీలు సక్రమంగా లేకపోవటం, ఇచ్చిన రుణాలు వసూలు కాకపోవటం వంటి అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు రావటంతో ఉంగుటూరు ఎంపీడీవోను విచారణాధికారిగా నియమించారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ కింద రూ.22.59 లక్షలు మంజూరు చేయగా, అందులో కేవలం రూ.5.60 లక్షలు మాత్రమే రికవరీ చేశారని, వేకనూరు క్లస్టర్‌లో రూ.2.09 లక్షలు మంజూరు చేయగా, అందులో ఒక్క రూపాయి కూడా రికవరీ కాలేదని విచారణాధికారి తెలిపారు. అవనిగడ్డ మండల మహిళా సమైక్య ద్వారా వీపీవో కింద రూ.3 లక్షల రుణాలు మంజూరు చేయగా, కేవలం రూ.20 వేలు మాత్రమే రికవరీ చేశారని, వేకనూరు క్లస్టర్ పరిధిలో రూ.95 వేలు మంజూరు చేస్తే ఒక్క రూపాయి కూడా రికవరీ చేయలేదని విచారణలో తేలింది. దీనికి తోడు నిధుల దుర్వినియోగం, ఆర్థిక లావాదేవీల్లో తేడాలు కూడా చోటు చేసుకున్నట్లు తేటతెల్లం కాగా, పరంజ్యోతిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని విచారణ అధికారి జిల్లా సమైక్యకు నివేదిక అందజేశారు.

వేకనూరు సీసీ పరంజ్యోతిని ఈనెల 20వ తేదీన సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సీసీ సస్పెండ్ ఉత్తర్వులను మండల సమైక్య సెర్ప్ ఉద్యోగులు బహిర్గత పర్చకపోవటం పలు అనుమానాలు తావిచ్చింది. ఈ వ్యవహారాన్ని ఏదో విధంగా కప్పిపుచ్చేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నట్లుగా మండల సమైక్యలోని గ్రామైక్య సంఘాల నుంచి విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఏరియా కో-ఆర్డినేటర్ రవిబాబును వివరణ కోరగా, పరంజ్యోతిని సస్పెండ్ చేస్తూ జిల్లా సమైక్య ఉత్తర్వులు జారీ చేసిన మాట వాస్తవమేనని, నిధులు దుర్వినియోగం అయ్యాయా? లేక సభ్యులే కట్టాలా? అనే విషయం తేలాల్సి ఉందని తెలిపారు.

చల్లపల్లి ఎస్సైగా సుబ్రహ్మణ్యం



చల్లపల్లి : చల్లపల్లి సబ్ ఇన్‌స్పెక్టర్‌గా పీఎస్‌వి.సుబ్రహ్మణ్యం బాధ్యతలు స్వీకరించారు. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల ఎస్సైగా పని చేస్తూ ఆయన బదిలీపై చల్లపల్లి వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన సుబ్రహ్మణ్యాన్ని ప్రజాప్రతినిధులు, టీడీపీ, సీపీఐ, ప్రజాసంఘాల నేత లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం స్థానిక నారాయణరావు నగర్‌లో ప్రజలతో సమావేశమైన ఎస్సై సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని సూచించారు.

పమిడిముక్కల ఎస్సైగా శ్రీను



పమిడిముక్కల : పమిడిముక్కల ఎస్సైగా బి.శ్రీను ఆదివారం బాధ్యతలు చేపట్టారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. పేకాట, కోడిపందేలు వేసే వారు, నిర్వహించే వారి సమాచారం అందించి సహకరించాలని ఎస్సై విజ్ఞప్తిచేశారు.

రాజేష్ సేవలు స్ఫూర్తిదాయకం



మచిలీపట్నం టౌన్ : తన కుమారుడి పుట్టిన రోజు సందర్భంగా మచిలీపట్నం ట్రాఫిక్ కానిస్టేబుల్ అంకం రాజేష్ రక్తదానం చేసి పలువురికి స్ఫూర్తిగా నిలిచాడు. మైత్రీ ఫౌండేషన్ సభ్యుడైన రాజేష్ రోగికి రక్తం దానం చేశాడు. రాజేష్ సేవలను మైత్రీ ఫౌండేషన్ అధ్యక్షుడు వేణుకుమార్ తదితరులు అభినందించారు.

గణపతి ఆలయం హుండీ చోరీ

పెడన : బస్టాండ్ సెంటర్‌లోని గణపతి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి హుండీని ఎత్తుకుపోయారు. ఆలయ నిర్వాహకుడు ఏనుగ సాయిరామ్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా పోలీసులు ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

టిడ్కో కాలనీలో కార్డెన్ సెర్చ్

గుడివాడ : ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు ఆదివారం మల్లాయిపాలెం శివారు టిడ్కో కాలనీలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఎస్సై ఎన్.చంటిబాబు మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలు, ఇన్‌చార్జ్ డీఎస్పీ పర్యవేక్షణలో కార్డెన్ సెర్చ్ నిర్వహించామన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ, మద్యం అక్ర మ రవాణ నివారణ, పాత కేసుల్లో నిందితుల ఇళ్లలో విస్తృత తనిఖీలు నిర్వహించామన్నారు. సరైన పత్రాలు లేని 33 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

పంటకాల్వలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు : ఎస్సై శ్రీనివాస్

అవనిగడ్డ : పంటకాలువలో వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై కె.శ్రీనివాస్ తెలిపారు. అవనిగడ్డలో ప్రధాన పంట కాలువ సమీపంలో, పరిసర ప్రాంతాల్లోని హోటళ్లు, మాంసం దుకాణ నిర్వాహకులకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. దీవి ప్రాంతానికి సాగు, తాగునీరు పంట కాలువల ద్వారా అందే నీరే ప్రధానమని, అలాంటి నీటిని కలుషితం చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన వ్యాపారులను హెచ్చరించారు.

పాలకాయతిప్పలో పోలీసు గస్తీ

కోడూరు : పాలకాయితిప్ప బీచ్ వద్ద కోడూరు పోలీస్, మెరైన్ సిబ్బంది గస్తీ కాస్తూ యాత్రికులకు పలు సూచనలు చేశారు. మైక్ ఉపయోగిస్తూ జాగ్రత్తలు తెలియజేశారు. ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. కోడూరు ఎస్‌ఐ పి.శిరీష, మెరైన్ ఎస్సై ఉజ్వల్ ఈ గస్తీలో పాల్గొన్నారు.

అగ్ని బాధితులకు ఆర్థిక సాయం

ఘంటసాల : ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నాలుగు గృహాలు దగ్ధం కాగా, చల్లపల్లికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యులు విస్సంశెట్టి మారుతి రామ్ స్పందించి ఒక్కొక్క కుటుంబానికి రూ.1000 చొప్పున నగదు అందజేశారు. విస్సంశెట్టి మొగిలేశ్వర గుప్తా, విశ్రాంత డిఎస్పీ హరిరాజేంద్ర బాబు, గొర్రెపాటి వెంకట రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాయుసుతకు నివాళి

కోడూరు : వి.కొత్తపాలెం టీడీపీ నేత భూపతి అశోక్ మాతృమూర్తి వాయుసుత శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. మాజీ జడ్పీటీసీ సభ్యులు బండే శ్రీనివాసరావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ముద్దినేని చంద్రరావు ఆదివారం వాయుసుత మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటేశ్వరరావు, ప్రతాప్, శేషగిరి, చిన్న, బండే వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పురస్కార గ్రహీతలకు సత్కారం



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 25 : మానవతావాదులు సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయమని మునిసిపల్ కమిషనర్ బాపిరాజు అన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో స్టార్ పాఠశాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో బాపిరాజు అతిథిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పురస్కారాలు అందుకున్న యోగ మాస్టర్ మద్దాల చింతయ్యకు యోగరత్న బిరుదుతోనూ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మచిలీపట్నం శాఖ అధ్యక్షుడు పి.శ్రీరాం దుశ్శాలువలతో ఘనంగా సత్కరించారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ మాట్లాడుతూ, సంస్థ అధ్యక్షుడు పి. శ్రీరామ్ కేరళ బాధితులకు రూ. 50 వేలు విరాళంగా కలెక్టర్‌కు ఇవ్వడం అభినందనీయమన్నారు. సంస్థ డైరెక్టర్ పి. సాయికృష్ణప్రసాద్ మాట్లాడుతూ, తమ సంస్థ ద్వారా ఉచితంగా ఫ్రీజర్ బాక్సులు అందిస్తున్నామన్నారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కె. రాజేంద్రప్రసాద్, పి.వి. ఫణి కుమార్, స్వామి తదితరులు మాట్లాడారు. ఉదయపు నడక మిత్రమండలి సమావేశపు హాలులో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్ అథారిటీ అధికారి ఝాన్సీ యోగ గురువులు ఘంటశాల గురునాథబాబు, మద్దాల చింతయ్య , ఘంటశాల మహాలక్ష్మి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సిలికానాంధ్ర వైద్యశాల సందర్శన



కూచిపూడి : పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ ఆదివారం సాయంత్రం కూచిపూడి సిలికానాంధ్ర వైద్యశాలను సందర్శించారు. ఆయన సమీప బంధువు వైద్యశాలలో చికిత్స పొందుతుండగా, ఆమెను పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో సంప్రదించారు. వైద్యశాలలో అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వైద్యశాల అధికారులు కృష్ణప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. వైద్యశాల ఏవో జొన్నలగడ్డ హనుమకుమార్, పామర్తి శివకుమార్, వీరంకి తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఆర్థిక స్వావలంబన సాధించాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎంపీపీ జనని కుమారి



మహిళలను సన్మానిస్తున్న తలశిల స్వర్ణలత

మోపిదేవి : ప్రతి మహిళా ఆర్థిక స్వావలంబన సాధించి లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ నడకుదుటి జననీ కుమారి తెలిపారు. లక్‌పతి దీదీ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో మొదటి విడతగా ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులు, సీఆర్పీలకు సర్టిఫికెట్లను ఆదివారం అందజేశారు. ఏపీవో ఎస్.శ్రీనివాసరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు. **నాగాయలంక** : నాగాయలంక దివిసీమ మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆదివారం లఖ్ పతి దీదీ కార్యక్రమంలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ వీడియో ప్రత్యక్ష ప్రసారాన్ని స్వయం సహాయక సంఘ సభ్యులు, లఖ్ పతి దీదీ, వీఏవోలు, సీసీలు, ఏపీఎం కె.వై.దాస్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఎం. లంకేశ్వరి, సిబ్బంది ప్రజాప్రతినిధులు కలసి వీక్షించారు. ఏపీఎం మాట్లాడుతూ ప్రతీ మహిళా జీవనోపాధిని కల్పించుకుని లక్షాధికారి కావాలని ప్రధానమంత్రి కోరారని తెలిపారు. ఈ కార్యక్రమంలో లఖ్‌పతి దీదీలను తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత సత్కరించారు.

రూ.34.67 కోట్లతో అభివృద్ధి పనులు : మండలి

అవనిగడ్డ, ఆగస్టు 25 : అవనిగడ్డ నియోజకవర్గంలోని 91 గ్రామపంచాయతీల్లో 34.67 కోట్లతో 997 అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యాయని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో 91 గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించామన్నారు. గ్రామసభలు ఆయా గ్రామాల్లో అభివృద్ధికి బాటలు వేశాయని తెలిపారు. రూ.24.40 కోట్లతో 301 సీసీ రోడ్ల నిర్మాణం, 5 కోట్లతో సీసీ డ్రైనేజీల నిర్మాణం, 35 లక్షలతో ఆరు ప్రహరీల నిర్మాణం, పశు పోషకులను ప్రోత్సహించేందుకు 242 పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.3.63 లక్షలు సబ్సిడీగా చెల్లించేందుకు గ్రామసభల్లో ప్రజామోదం లభించినట్లు బుద్ధప్రసాద్ తెలిపారు. ఉద్యానవన రంగాన్ని ప్రోత్సహించేందుకు 111.33 ఎకరాల్లో మొక్కలు నాటేందుకు రూ.17.75 లక్షలు, 16.2 కిలోమీటర్ల పొడవునా ప్రధాన రహదారులు, పంట కాలువల వెంబడి మొక్కలు నాటేందుకు రూ.20 లక్షలు, 20 ఫామ్ పాండ్స్ తవ్వేందుకు రూ.30 లక్షలు, రెండు మినీ అమృత సరోవర్ చెరువులు తవ్వేందుకు రూ.50 లక్షలు, ఎనిమిది రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌ల నిర్మాణానికి రూ.10 లక్షలు, 12 చోట్ల సామాజిక ఇంకుడు గుంతల కోసం రూ.12 లక్షలు, 115 వ్యక్తిగత ఇంకుడు గుంతలు తవ్వేందుకు రూ.6.90 లక్షలు, 280 ఇతర పనులకు రూ.75.60 లక్షలు గ్రామసభల ద్వారా కేటాయించినట్లు బుద్ధప్రసాద్ తెలిపారు.

సేవారత్న అవార్డు ప్రదానం నేడు

అవనిగడ్డ : ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శ్రీకళసుధ తెలుగు అసోసియేషన్ వారి సేవారత్న అవార్డుకు ఎంపికయ్యారు. శ్రీకృష్ణాష్టమి సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈనెల 26వ తేదీన చెన్నైలో బుద్ధప్రసాద్ అవార్డు అందుకుంటారని, వైద్య, రాజకీయ, సంగీత, నృత్య రంగాల్లో గుర్తింపు పొందిన వారికి ఈ అవార్డు ప్రదానం చేస్తారని గాంధీక్షేత్రం వర్గాలు తెలిపాయి. బుద్ధప్రసాద్‌కు సేవారత్న అవార్డు రావటం పట్ల అవనిగడ్డ మండలానికి చెందిన పలువురు స్వచ్ఛంద సేవకులు, సాహితీ మి త్రులు హర్షం వ్యక్తం చేశారు. మునగాల బాలకృష్ణారావు, భోగాది చంద్రశేఖర్, జిల్లా రచయితల సంఘం శాశ్వత సభ్యులు దీవి ఝాన్సీ, సింహాద్రి పద్మ హర్షం వ్యక్తం చేశారు.

నందమూరులో అక్రమంగా మట్టి తరలింపు

పెడన రూరల్ : నందమూరు హైస్కూల్ సమీపంలోని ప్రైవేట్ స్థలంలో మట్టి తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోవటం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారినా అక్రమ మట్టి తరలింపు ఆగక పోవటంతో జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయగా పనులు నిలుపుదలచేశారు. సమీపంలోని దేవాలయం అభివృద్ధికి మట్టి తరలిస్తున్నట్లు చెబుతూ, ప్రైవేటు స్థలానికి మట్టి తరలిస్తున్నారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందడంతో తాత్కాలికంగా పనులు నిలిపివేశారు.



ఉచిత కంటి వైద్య పరీక్షలు

నాగాయలంక : శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారిచే ఆదివారం మారుతీ విద్యానికేతన్ స్కూల్‌లో మండవ దుర్గా భవాని జ్ఞాపకార్థం కుటుంబసభ్యుల ఆర్థిక సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. డాక్టర్ యోగేష్, జాగృతి 102 మంది కంటి రోగులకు పరీక్షలు చేసి, మందులు ఇచ్చారు. ఇందులో 85 మందిని కంటి ఆపరేషన్ల కోసం రిఫర్ చేసి పెదకాకానికి ప్రత్యేక బస్సులో రోగులను తీసుకెళ్లారు. తలశిల రఘుశేఖర్, కనిగంటి నారాయణ, తలశిల లీలా మనోహర్‌తోపాటు క్యాంప్ ఇంచార్జ్ నాగబాబు, మల్లిఖార్జునరావు, జామిలా మస్తాన్, మత్తి శివ పాల్గొని పర్యవేక్షించారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో చర్మవ్యాధులు దూరం

మచిలీపట్నం టౌన్ : వ్యక్తిగత పరిశుభ్రతతో చర్మవ్యాధులు దూరమవుతా డాక్టర్ కోసూరు ఫణికుమార్ అన్నారు. ఉదయపు నడక మిత్ర మండలి ఆధ్వర్యంలో ఆదివారం గాంధీనగర్‌లోని వాకర్స్ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్మవ్యాధులు దీర్ఘకాలిక వ్యాధులు కావన్నారు. వంశపారంపర్యంగా ఈ వ్యాధులు సంక్రమించవచ్చన్నారు. మిత్ర మండలి అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించగా, కార్యదర్శి జల్దు మురళీనాథ్, వి. లక్ష్మీనరసింహం, లింగం మోజెస్, పి. వెంకటేశ్వర్లు, వింధ్యారేఖ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు బాల్యం నుంచి శతక పద్యాలు నేర్పాలి



మచిలీపట్నం టౌన్ : పిల్లలకు బాల్యం నుంచి శతక పద్యాలు నేర్పాలని మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ రావు అన్నారు. పల్లావఝుల వెంకట శైలజ రచించిన సాయి చరిత శతకాన్ని ఆమె సోదరుడు పి.వి.ఫణికుమార్ ఆదివారం కొనకళ్ల నారాయణరావుకు అందజేశారు. కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, తెలుగు సాహిత్యంలో పద్యానికి ప్రాధాన్యత ఉందన్నారు. తెలుగు సాహిత్యానికి పూర్వవైభవం తీసుకునివచ్చేందుకు కవులు కృషి చేయాలన్నారు.



కౌతవరంలో లయన్స్ వైద్యపరీక్షలు

గుడ్లవల్లేరు : లయన్స్ ఆధ్వర్యంలో కౌతవరంలో కానూరి ట్రస్టు చైర్మన్ కానూరి సత్యనారాయణ ప్రసాద్ (సత్తిబాబు) వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. గుడివాడ నవ్యసాయి పిల్లల ఆసుపత్రి డాక్టర్ ఏ.శ్రీనాథ్ రెడ్డి, డాక్టర్ గుత్తా శ్రీ శ్రావ్య బృందం 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కృష్ణ మల్టీసెపషాలిటీ డెంటల్ డాక్టర్ అట్లూరి విద్యాసాహితి 35 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు శశికళ, కార్యదర్శి మేరుగు పెరుమాళ్ళు, కోశాధికారి నవాబు, వైపిసి ప్రసాద్, చాపరాల బాలాజీ, పొట్లూరి శ్రీవెంకటేశ్వరరావు, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి ప్రశాంతంగా జరుపుకోవాలి : ఎస్సై గణేష్

బంటుమిల్లి : బాసినపాడు గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్సై గణేష్ అన్నారు. వినాయక చవితి, కృష్ణాష్టమి ఉత్సవాలకు ప్రతిఏటా గొడవలు జరుగుతున్నాయి. ప్రతి పండుగకు పోలీసులు రావడం ఎలాంటి సమస్యలు రాకుండా చూడటం జరుగుతోంది. ఈ సంవత్సరం ముందస్తుగా ఎస్సై గ్రామస్థులతో ముందుగా సమావేశం ఏర్పాటు చేసి ప్రశాంత వాతావరణంలో పండుగలు జరుపుకోవాలని ఎలాంటి కోపతాపకాలకు, ఆవేశాలకు లోను కావద్దు అని సూచించారు.

కమిషనర్ తామర చెరువు సందర్శన

పెడన : పట్టణంలోని తామర చెరువును కమిషనర్ మన్నం గోపాలరావు ఆదివారం పరిశీలించారు. చెరువు గుర్రపుడెక్కతో నిండిపోవడంతో తాగునీరు లభ్యం కాక పశువులు అల్లాడుతున్నాయి. చైర్‌పర్సన్ కటకం నాగకుమారి ఆదేశాలను పురస్కరించుకుని గుర్రపుడెక్కను తొలగించేందుకు కమిషనర్ గోపాలరావు ఆదివారం కౌన్సిలర్ కటకం ప్రసాద్‌తో కలిసి తామరచెరువును పరిశీలించారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

మచిలీపట్నం టౌన్ : మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో సీజనల్ జ్వరాలు ప్రబలుతున్న దృష్ట్యా హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని కలెక్టర్ డీకే బాలాజీని సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీ కోరారు మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారన్నారు. తాగునీటి పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై, దోమల నిర్మూలన, పరిశుద్ధ చర్యలపై దృష్టి సారించాలన్నారు.



దిక్సూచి DIKSUCHI

"ప్రస్తుతం మనం అనుసరిస్తున్న పౌరస్మృతిలో మతతత్వ ఛాయలు ఉన్నాయి. మతం ఆధారంగా వివక్షను ప్రోత్సహించేలా ఉంది. దాని స్థానంలో 'లౌకిక పౌరస్మృతి'ని తీసుకురావాల్సిన అవసరం ఉంది" అని స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఎర్రకోటపై జాతీయ పతాకావిష్కరణ సందర్భంగా ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు కూడా అనేక సార్లు ఉమ్మడి పౌరస్మృతి గురించి చర్చించి, దీన్ని అమల్లోకి తేవాలని ఆదేశాలు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో ఈ అంశం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా 'ఉమ్మడి పౌరస్మృతి' అంటే ఏమిటి? చట్టాలు వ్యక్తిగతంగా ఉండాలా? మత పరంగా ఉండాలా? లేదా దేశ పౌరులందరికీ ఒకే చట్టం వర్తింప జేయాలా? అనే అంశాలను సమగ్రంగా చర్చిద్దాం.

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

ఉమ్మడి పౌరస్మృతి

'ఒకే దేశం - ఒకే చట్టం'

ఇండియన్ పాలిటీ

దొంగతనం, అత్యాచారం, హత్య... ఈ నేరాలు ఎవరు చేసినా వారి మతం, కులాలతో సంబంధం లేకుండా కోర్టులు శిక్షలు విధిస్తాయి. కానీ... పెళ్లి, విడాకులు, భరణం, దత్తత, వారసత్వం, మహిళలకు ఆస్తిహక్కు వంటి విషయాల్లో మాత్రం దేశ ప్రజలందరికీ ఒకే చట్టం వర్తించదు. హిందువులకు, ముస్లింలకు, క్రైస్తవులకు వారి వారి పర్సనల్ లాస్(మతం ఆధారంగా కల్పించిన వ్యక్తిగత చట్టాలు) ఆధారంగా శిక్షలు ఉంటాయి. అలాగే రాష్ట్రాలవారీగానూ అనేక చట్టాలు ఉన్నాయి. అలా కాకుండా పెళ్లి, విడాకులు, దత్తత, వారసత్వం, ఆస్తిహక్కు వంటి వాటి విషయాల్లో రాష్ట్రాలకు, మతాలకు అతీతంగా అందరికీ ఒకే చట్టం ఉండాలనే భావనకు ప్రతిరూపమే 'ఉమ్మడి పౌరస్మృతి'.

ముందు దేశపౌరుడు, ఆ తరవాతే మతం

ఓ మైనర్ ముస్లిం బాలిక వివాహానికి సంబంధించి కేరళ హైకోర్టు ఇటీవల ఒక తీర్పును వెలువరించింది. 15 ఏళ్లలోపు వివాహం చేసుకునే హక్కు ఉందని బాలిక తండ్రి చేసిన వాదనను తిరస్కరించింది. 'ఏ వ్యక్తి అయినా ముందు దేశ పౌరుడని, ఆ తరవాతే ఆయా మతాల సభ్యులని పేర్కొంటూ..... హిందువైనా, ముస్లిమైనా, క్రిస్టియన్ అయినా.... అందరికీ బాల్య వివాహ నిషేధచట్టం(2006) వర్తిస్తుందని కేరళ హైకోర్టు 28 జూలై 2024న స్పష్టం చేసింది.

ఇతర దేశాల్లో ఉమ్మడి పౌరస్మృతి

- అమెరికాలో భిన్న మతాలను అవలంబించేవారు, భిన్న జాతులకు చెందిన ప్రజలు నివశిస్తున్నారు. అలాగని అక్కడ విడివిడిగా ప్రత్యేక చట్టాలు లేవు.
- ఫ్రాన్స్, జర్మనీ, చైనాలో కూడా మతాల ప్రాతిపదికన చట్టాలు లేవు.
- ఈజిప్ట్, మొరాకో, తుర్కియో వంటి ముస్లిం దేశాల్లోనూ అల్పసంఖ్యాక వర్గాలకు ప్రత్యేక చట్టాలు లేవు.


పర్సనల్ లాస్

మన దేశంలో పౌరుల వ్యక్తిగత అంశాలైన పెళ్లి, ఆస్తులు, వారసత్వం, దత్తత వంటి వాటికి సంబంధించి ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలను మతం ఆధారంగా రూపొందించారు. అవి... హిందూ వివాహ చట్టం(1955), హిందూ వారసత్వ చట్టం(1956), హిందూ దత్తత నిర్వహణ చట్టం(1956); భారతీయ క్రైస్తవ వివాహ చట్టం(1957), భారత విడాకుల చట్టం(1969); పార్సీ వివాహ, విడాకుల చట్టం(1936), ముస్లిం పర్సనల్ లా అప్లికేషన్ యాక్ట్(1937), ఈశాన్య రాష్ట్రాల సంప్రదాయ చట్టాలు, కశ్మీర్ సంప్రదాయ చట్టాలు మొదలైనవి.

(మిగతా రేపటి దిక్సూచిలో)



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్



ఎలిజిబిలిటీ టెస్ట్

రీజనింగ్

రీజనింగ్‌కి సంబంధించిన ఎలిజిబిలిటీ టెస్ట్ అనే ఈ టాపిక్‌కి చాలా ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఎస్.ఐ., బ్యాంకింగ్ మొదలైన పరీక్షల్లో ఈ విభాగం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశం ఉన్నది.

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో ముందుగా ఏదైనా ఉద్యోగానికి, కళాశాలలో ప్రవేశానికి, బ్యాంకులో లోన్ లభించడానికి మొదలైన వివిధ అంశాలకు అర్హతలు నిర్ణయిస్తారు. తదుపరి వివిధ వ్యక్తుల వ్యక్తిగత సమాచారం (పర్సనల్ డేటా) తెలుసుకుంటారు. ఆ సమాచారంలోని అంశాలు ప్రశ్నలో ఇచ్చిన అర్హతలకు సరిపోయిందా లేదా పరిశీలించి దానిని బట్టి ఐచ్ఛికాలుగా ఎ, బి, సి, డి, ఇ లలో సరైన దానిని సమాధానంగా గుర్తించాలి. గ్రూప్ 1 కోచింగ్‌ను అందించే ఒక ప్రముఖ శిక్షణసంస్థలో ఉచిత కోచింగ్ ప్రవేశానికి విద్యార్థికి తప్పనిసరిగా కింది అర్హతలు ఉండాలి.

1. విద్యార్థి కచ్చితంగా పోస్ట్ గ్రాడ్యుయేట్ చదివి ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేట్‌లో తప్పనిసరిగా ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణత పొంది ఉండాలి.
2. విద్యార్థి వయసు 2023 మే 25 నాటికి 22 సంవత్సరాలకు తగ్గకూడదు, 30 సం॥లకు మించకూడదు.
3. విద్యార్థి సంరక్షకుల వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదు.
4. విద్యార్థి కోచింగ్ శిక్షణాకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు లేదా పరీక్ష తేదీ వరకు (ఏదీ ముందు జరిగితే అలా) తప్పనిసరిగా కోచింగ్ నిర్వాహకులు తెలిపిన విధంగా ప్రిపరేషన్ కొనసాగిస్తూ శిక్షణసంస్థలోనే ఉండాలి.
5. ఆ సంస్థ ద్వారా ఉచిత కోచింగ్ పొంది ఉద్యోగానికి ఎన్నికైతే తప్పనిసరిగా ఆ సంస్థకు 50,000 రూపాయలను విరాళంగా ఇవ్వడానికి సుముఖత తెలుపుతూ అంగీకారపత్రంపై సంతకం చేయాలి.
6. పై వాటిలో ఒకటో అర్హతకు బదులుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 75% మార్కులు ఉన్నట్లయితే ఆ విద్యార్థి విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
7. పై వాటిలో అయిదో పాయింట్‌లో సూచించిన విధంగా అంగీకార పత్రానికి బదులు శిక్షణాకాలం జరుగుతున్న సమయంలోనే రూ.15,000/- చెల్లించడానికి సుముఖత తెలిపితే అభ్యర్థి విషయం కోచింగ్ సంస్థ (శిక్షణ సంస్థ) డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

పైన పేర్కొన్న అర్హతలు, నియమ నిబంధనలకు లోబడి కింద ఇచ్చిన వివిధ విద్యార్థుల వ్యక్తిగత సమాచారాన్ని ఆధారంగా చేసుకొని ఐచ్ఛికాల్లో తెలిపిన సమాధానాల్లో ఏది సరైనదో నిర్ణయించండి.

1. అవినాష్ ఎంటెక్ 70% మార్కులతో పూర్తి చేశాడు. పుట్టిన తేదీ 2002 జూన్ 1. అవినాష్ సంరక్షకుల వార్షికాదాయం రూ.96,000. అవినాష్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ దగ్గరే ఉండటానికి, అయిదో పాయింట్‌లో తెలిపినట్లు అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) అవినాష్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు
బి) అవినాష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.
సి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
డి) అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) అవినాష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (డి)

వివరణ: అవినాష్ పుట్టిన తేదీ 2002 జూన్ 1. ప్రశ్నలో తెలిపిన 2023 మే 25 నాటికి అవినాష్‌కి 21 సంవత్సరాలు మాత్రమే. వయసు సరిపోదు కాబట్టి అవినాష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు.

2. దినేష్ ఎమ్మే 56% మార్కులతో పూర్తి చేశాడు. అతను పుట్టినతేదీ 1996 ఆగస్టు 24. డిగ్రీలో అతనికి 82% మార్కులు లభించాయి. దినేష్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.93,000/-. శిక్షణ పూర్తయిన తరవాత పరీక్ష తేదీ వరకు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు.

ఎ) దినేష్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) దినేష్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) దినేష్ ఇచ్చిన సమాచారం సరిపోదు.
డి) దినేష్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది ఇ) దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (ఇ)

వివరణ: దినేష్‌కు ఇచ్చిన అర్హతలలో 2, 3, 4, 5 అర్హతలు ఉన్నాయి. ఒకటో అర్హతకు బదులుగా 6వ పాయింట్‌లో తెలిపిన విధంగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణత చెంది గ్రాడ్యుయేషన్‌లో 82% మార్కులు పొందడం వలన దినేష్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

3. వికాస్ ఎమ్మెస్సీ 70% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.60,000/-. కోచింగ్ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దనే ఉండటానికి నిశ్చయించుకుని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేశాడు.

ఎ) వికాస్ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
బి) వికాస్ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
సి) ఇచ్చిన సమాచారం సరిపోదు
డి) వికాస్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది
ఇ) వికాస్ విషయం శిక్షణాసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది

సమాధానం: (సి)

వివరణ: వికాస్ పుట్టినతేదీ గురించి ఎటువంటి సమాచారం లేదు.

4. తేజ ఎమ్మే 75% మార్కులతో పూర్తి చేశాడు. అతని సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.78,000/-. కాని శిక్షణ పొందడానికి 15,000/- చెల్లించడానికి అంగీకరించాడు. శిక్షణకాలం పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండటానికి నిర్ణయించుకున్నాడు. కాని అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకారపత్రంపై సంతకం చేయలేదు. తేజ పుట్టిన తేదీ 1996 జూన్ 11.

ఎ) తేజ ఉచిత కోచింగ్‌కు అర్హుడు
బి) తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
సి) తేజ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు డి) తేజ ఉచిత కోచింగ్‌కు అనర్హుడు
ఇ) తేజ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (బి)

వివరణ: తేజకు ఇచ్చిన అర్హతలలో 1, 2, 3, 4 అర్హతలు ఉన్నాయి. అయిదో అర్హతకు బదులుగా ఏడో పాయింట్‌లో తెలిపిన విధంగా రూ.15,000/- చెల్లిస్తున్నందున తేజ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది.

5. ప్రశాంత్ ఎంకామ్ 65% మార్కులతో పూర్తి చేశాడు. ప్రశాంత్ శిక్షణ పూర్తయిన తరవాత రెండు నెలలు శిక్షణసంస్థ వద్దే ఉండడానికి నిర్ణయించుకున్నాడు. అయిదో పాయింట్‌లో తెలిపిన విధంగా అంగీకార పత్రంపై సంతకం చేశాడు. అతను పుట్టిన తేదీ 1994 ఏప్రిల్ 4. ప్రశాంత్ సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.1,20,000/-.

ఎ) ప్రశాంత్ విషయం శిక్షణసంస్థ డైరెక్టర్ పరిశీలనకు వెళుతుంది
బి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అర్హుడు
సి) ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు
డి) ప్రశాంత్ గురించి ఇచ్చిన వ్యక్తిగత సమాచారం సరిపోదు ఇ) ప్రశాంత్ విషయం సేవాసంస్థ నిర్వాహకుల పరిశీలనకు వెళుతుంది.

సమాధానం: (సి)

వివరణ: ప్రశాంత్ సంరక్షకుల వార్షికాదాయం రూ.1,20,000/-లు. మూడో అర్హతలో వార్షికాదాయం లక్ష రూపాయలకు మించకూడదని ఉన్నది. కాబట్టి ప్రశాంత్ ఉచిత శిక్షణకు అనర్హుడు.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

అటకెక్కిన 'ఫిష్ ఆంధ్ర'

వైసీపీ హయాంలో వస్తు సామగ్రి కొనుగోలులో భారీ అవినీతి

- లబ్ధిదారులకు భారమైన ఫ్రాంచైజీ, బ్రాండింగ్
- వినియోగదారుల నుంచి కరువైన ఆదరణ
- లక్షల్లో నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువత




అమరావతి, ఆగస్టు 25(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కల్పించడానికే 'ఫిష్ ఆంధ్ర' అంటూ డప్పు కొట్టిన వైసీపీ ప్రభుత్వం... ఆచరణలో భారీ అవినీతికి తెరతీసింది. వైసీపీ పార్టీ రంగులతో, ప్రచార ఆర్భాటంతో ఆరంభమైన 2,300 యూనిట్లలో చాలా వరకూ మూతపడ్డాయి. లబ్ధిదారులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు రూ.లక్షల్లో నష్టపోయారు. టీడీపీ ప్రభుత్వం దీనిపై దృష్టిపెడితే అవినీతి చేపలు దొరికే అవకాశం ఉంది. లబ్ధిదారులకు నగదు రాయితీ ఇచ్చి, నిర్దేశిత ప్రమాణాలతో రిటైల్ ఔట్‌లెట్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పాల్సిన మత్స్య శాఖ... ఫ్రాంచైజీ రుసుము చెల్లించాలని, పరికరాలను తాము చెప్పిన సంస్థ నుంచే తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. ఇక్కడే అవినీతి, అవకతవకలకు ఆస్కారం ఏర్పడింది. 'ఫిష్ ఆంధ్ర' కాస్తా... 'స్కామ్ ఆంధ్ర'గా మారింది. వస్తు సామాగ్రిని తమకు అనుకూలమైన సంస్థల నుంచి కొనుగోలు చేయించి, నిధుల గోల్‌మాల్‌కు తెరదీశారు. బ్యాంకు రుణం, కేంద్రం, లబ్ధిదారుని వాటా నిధులతో వస్తు సామాగ్రి కొనుగోలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన తనవంతు వాటాను విడుదల చేయలేదు. లైవ్ ఫిష్ టబ్, బల్లలు, చేపలు శుద్ధి చేసే పనిముట్లు, శీతలీకరణకు రిఫ్రిజిరేటర్, ఐస్ తయారీ యంత్రం తదితర వస్తువులు... నాణ్యత ఏ మాత్రం లేని వాటిని ఎక్కువ ధరకు కొనుగోలు చేయించారు. లోగుట్టుగా అవినీతికి పాల్పడిన వైసీపీ నేతలు, అధికారులు... ప్రచారాన్ని మాత్రం ఊదరకొట్టారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 20,000 మందికి ఉపాధి లభించిందని వైసీపీ ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. ఫ్రాంచైజీ పేరుతో ఆరంభంలో రూ.80 వేలు వసూలు చేసిన మత్స్య శాఖ... ఫిష్ ఆంధ్ర బ్రాండింగ్ కోసం ప్రతి నెలా రూ.7,000 చెల్లించాలన్న నిబంధన పెట్టింది. ప్రారంభించిన కొద్ది నెలలకే కొనుగోలు చేసిన వస్తు సామాగ్రిలో చాలా వరకూ మూలకు చేరింది. నిర్వహణ భారమయింది. లైవ్ ఫిష్ వ్యాపారానికి ఆదరణ లభించలేదు. దీంతో ఫిష్ ఆంధ్ర అటకెక్కింది. మళ్లీ 20 వేల మంది రోడ్డుపైకి వచ్చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన ఈ పథకం తీరుతెన్నులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తే అనేక అవకతవకలు బయటపడతాయి.

156 ఔషధాలపై కేంద్రం నిషేధం!

- జాబితాను విడుదల చేసిన ఔషధ నియంత్రణ శాఖ

గుంటూరు(మెడికల్), ఆగస్టు 25: ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని 156 రకాల ఫిక్స్‌డ్ డోస్ కాంబినేషన్(ఎఫ్‌డీసీ) మందులపై కేంద్ర ప్రభుత్వం నిషేధం విధించింది. తక్షణం వీటి తయారీ, పంపిణీ, విక్రయాలు నిలిపివేయాలని కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. నిషేధించిన మందుల్లో పలు యాంటీ బయోటిక్, యాంటీ అలర్జీ, అధిక రక్తపోటు, నొప్పి నివారణ మందులు, మల్టీ విటమిన్ ట్యాబ్లెట్లు తదితరాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం నియమించిన డ్రగ్ టెక్నికల్ అడ్వైజరీ బోర్డ్ (డీటీఏబీ) సూచనల మేరకు ఈ మందులపై కేంద్ర ఆరోగ్య శాఖ నిషేధం విధించింది. ఈ మేరకు ఈనెల 12వ తేదీన గెజిట్ నోటిఫికేషన్‌ను వెలువరించింది. నిషేధ మందుల జాబితాను అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు పంపింది. తాజాగా గుంటూరు జిల్లా ఔషధ నియంత్రణ శాఖ అధికారులు ఆ నిషేధిత మందుల జాబితాను విడుదల చేశారు. వీటిని తక్షణం దుకాణాల నుంచి తొలగించాలని ఆదేశిస్తూ జిల్లాలోని హోల్‌సేల్, రిటైల్ మందుల దుకాణాదారులకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ మందుల కాంబినేషన్‌లో హేతుబద్ధత లేదని, పైగా రోగుల చికిత్సల్లో ఈ మందుల వినియోగం వల్ల ఆరోగ్యానికి హాని కలిగే ప్రమాదం ఉందని డీటీఏబీ నిపుణులు పేర్కొన్నారు. బాగా ప్రాచుర్యంలో ఉన్న పలు ప్రముఖ కంపెనీల ఉత్పత్తులు నిషేధిత మందుల జాబితాలో ఉండటం విశేషం. మెఫనమిక్ యాసిడ్, పారా సిటమాల్ కాంబినేషన్ ఇంజెక్షన్లను సాధారణంగా నొప్పి నివారణకు వినియోగిస్తారు. ఈ కాంబినేషన్ మందు వల్ల రోగుల్లో తీవ్రమైన దుష్ఫలితాలు తలెత్తుతున్నట్లు నిపుణులు గుర్తించారు. అదే విధంగా ఎసిక్లోఫెనాక్, పారాసిటమాల్ కాంబినేషన్ చాలా సాధారణంగా వైద్యులు ప్రిస్క్రైబ్ చేస్తుంటారు. ఈ కాంబినేషన్‌పైనా ప్రభుత్వం నిషేధం విధించింది. మొటిమల చికిత్స, ముక్కు దిబ్బడ, చర్మవ్యాధుల చికిత్సల్లో వాడే ఔషధాలు కూడా నిషేధిత జాబితాలో ఉన్నాయి. గతంలో 2018లో కేంద్ర ప్రభుత్వం 328 ఎఫ్‌డీసీ మందులపై నిషేధం విధించింది. ఆరేళ్ల తర్వాత మరోసారి పెద్ద సంఖ్యలో మందులపై నిషేధం విధిస్తూ కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేయడం విశేషం.

1నుంచి బీజేపీ సభ్యత్వం: పురందేశ్వరి



సర్పవరం జంక్షన్ (కాకినాడ), ఆగస్టు 25: 'పదకొండవ ఆర్థిక శక్తిగా ఉన్నటువంటి భారతదేశాన్ని ప్రధాని మోదీ పాలనలో ఐదో ఆర్థిక శక్తిగా అవతరించి ప్రపంచ పటంలో ఆవిష్కరించింది. రాబోయే ఆర్థిక సంవత్సరంలో మూడో ఆర్థికశక్తిగా చూడాలనే దిశగా బీజేపీ కూటమి ప్రయత్నిస్తోంది' అని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి అన్నారు. ఆమె కాకినాడలో పార్టీ సభ్యత్వ నమోదుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. సెప్టెంబరు 1 నుంచి ప్రారంభించే పార్టీ సభ్యత్వ నమోదుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. 37 లక్షల మంది సభ్యత్వ నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆమె తెలిపారు. కాగా, త్వరలో జమ్మూకశ్మీర్‌లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి తమ మేనిఫెస్టోలో ఆర్టికల్ 370, 35ఏలను పునరుద్ధరిస్తామని ప్రకటించడాన్ని బట్టి దేశాన్ని విచ్ఛిన్నం చేసే రీతిలో వ్యవహరిస్తారని మండిపడ్డారు. దీనిపై రాహుల్ గాంధీ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు చిలుకూరి రామ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ: భువనేశ్వరి



హైదరాబాద్, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు ద్వారా పేద అభ్యర్థులకు డీఎస్సీ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా కుప్పంలో ఈ శిక్షణ ఉంటుందని, అర్హులు వినియోగించుకోవాలని ఆమె కోరారు. శిక్షణ కాలంలో అభ్యర్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందిస్తామని తెలిపారు.

బడితో చెడుగుడు!

నాడు-నేడుపై జగన్ సర్కారు చెప్పినవన్నీ అబద్ధాలే

- ప్రచారం కోసం పథకాన్ని వాడుకున్న వైసీపీ పెద్దలు
- చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే నిలిపేసిన వైనం
- మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిపెట్టని నేతలు
- జగన్ ప్రభుత్వంలో మూడు వేల కోట్లు పక్కదారి
- ఇప్పుడు వాటినేం చేయాలంటూ అధికారుల కసరత్తు
- పథకం పేరు 'మన బడి-మన భవిష్యత్తు'గా మార్పు
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)


'నాడు-నేడు' పథకంతో ప్రభుత్వ బడుల రూపురేఖలు మార్చేస్తామని గత జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. అయితే ఇందులో ప్రచారం తప్ప పనులేం చేయలేదని తేలింది. చాలాచోట్ల ఎక్కడి పనులు అక్కడే వదిలేసినట్లు వెల్లడైంది. ప్రభుత్వ బడుల్లో అద్భుతాలు అంటూ రాజకీయ లబ్ధి కోసం విశ్వప్రయత్నాలు చేసిన వైసీపీ పెద్దలు... వాటిలో మౌలిక సదుపాయాల పురోగతిపై దృష్టి పెట్టలేదు. దీంతో నాడు-నేడు మధ్యలోనే ఆగిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అంచనా వేయగా నాడు-నేడు రెండో దశలో కేవలం 7.88శాతం పనులే పూర్తిచేసిన విషయం బయటపడింది. 22,311 బడుల్లో రెండోదశ పథకం ప్రారంభించగా కేవలం 1,759 బడుల్లో మాత్రం పనులు పూర్తయ్యాయి. 20,552 పాఠశాలల్లో మధ్యలోనే నిలిచిపోయాయి. ఇప్పుడు వాటినెలా పూర్తిచేయాలన్న దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది. తొలుత కాంట్రాక్టు విధానంలో పనులు చేయించాలని యోచించినా, తల్లిదండ్రుల భాగస్వామ్యం ఉండాలని నిర్ణయానికొచ్చింది. కొత్తగా ఎన్నుకున్న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయాలని భావిస్తోంది. పనులు ఏ దశల్లో ఉన్నాయి? ఇంకా ఏ మేరకు నిధులు అవసరం? అనేదానిపై పాఠశాల విద్యాశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. కాగా 'నాడు-నేడు' పథకం పేరును 'మన బడి-మన భవిష్యత్తు'గా ప్రభుత్వం మార్చింది.

పనుల ప్రారంభంపైనా ఆరా

పనులు మధ్యలో వదిలేయడం ఒకెత్తు అయితే అసలు ఏ ప్రాతిపదికన బడుల్లో పనులు మొదలు పెట్టారనే అంశంపై కూడా పాఠశాల విద్యాశాఖ అధికారులు ఆరా తీస్తున్నారు. నాడు- నేడు పథకం ప్రారంభం నాటి అధికారులతో ఇటీవల సమావేశం నిర్వహించారు. ఆ బాధ్యతల నుంచి తప్పుకొని వెళ్లిపోయిన వారిని కూడా పిలిపించారు. మొదటి, రెండో దశల్లో పనులు ప్రారంభానికి బడులను ఏ ప్రాతిపదికపై ఎంపిక చేశారో తెలుసుకుంటున్నారు. నాడు-నేడు పేరుతో భారీగా నిధులు ఖర్చు చేశాక కొన్ని ప్రాథమిక పాఠశాలలు మూతపడ్డాయి. తరగతుల విలీనం ప్రక్రియ చేపట్టడంతో కొన్ని బడుల్లో విద్యార్థుల సంఖ్య జీరోకు చేరింది. దీంతో అక్కడి టీచర్లను ఇతర పాఠశాలలకు పంపి, ఆ బడులకు తాళాలు వేశారు. అయితే విద్యార్థుల సంఖ్య అంతంతమాత్రంగా ఉన్న బడులను ఎందుకు ఎంపిక చేయాల్సి వచ్చిందో ఇప్పుడు వివరాలు సేకరిస్తున్నారు.

ప్రాథమిక పాఠశాలలపై దృష్టి

ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు మెరుగ్గానే ఉన్నా ప్రాథమిక పాఠశాలల పరిస్థితి ఏటా దిగజారుతోంది. విద్యార్థులు లేక ఆ బడులు వెలవెలబోతున్నాయి. 20 మంది విద్యార్థులు కూడా లేని బడులు దాదాపు దాదాపు 12వేల వరకూ ఉన్నాయి. వీటిలో కేవలం ఒక్కరే టీచరు ఉన్నారు. దీంతో ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఆ బడుల్లోనూ ఒక్కో తరగతికి ఒక టీచర్‌ను నియమించే ఆలోచన చేస్తోంది. దాంతోపాటు అన్ని బడుల్లో మౌలిక వసతులు అభివృద్ధి చేయాలని, వచ్చే ఏడాది నాటికి టీచర్లను పెంచి విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ప్రయత్నించాలని ప్రణాళికలు రూపొందిస్తోంది.



ఎక్కడి పనులు అక్కడే

45వేల ప్రభుత్వ బడుల్లో మొత్తం మూడు దశల్లో మౌలిక సదుపాయాల కల్పన పూర్తిచేస్తామని జగన్ ప్రభుత్వం ప్రకటించింది. మొదటి దశలో 15,715 బడుల్లో పథకం ప్రారంభించగా, దాదాపుగా పూర్తయ్యాయి. రెండోదశ పనులు 2022లో ప్రారంభించారు. 22,311 బడుల్లో వసతులు అభివృద్ధి చేయడంతో పాటు అదనపు గదుల నిర్మాణం చేపట్టారు. రూ.8వేల కోట్ల అంచనాతో ప్రారంభించిన ఈ పనులకు ఇప్పటి వరకూ రూ.4,107 కోట్లు ఖర్చు చేశారు. అయితే రూ.7వేల కోట్లకు పైగా నిధులను వివిధ రూపాల్లో సమీకరించినా వాటిని పథకానికి వినియోగించకుండా పక్కదారి పట్టించారు. నిధుల లేమితో వేల సంఖ్యలో బడుల్లో పనులు మధ్యలో నిలిచిపోయి ప్రాంగణాలన్నీ అస్తవ్యస్తంగా మారాయి. దీనిపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పల్నాడు, కడప, విజయనగరం, మన్యం మినహా ఏ జిల్లాలోనూ పది శాతం పనులు కూడా పూర్తికాలేదు.